


# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఆగస్టు 2018

సంపుటి : 24 **283** సంచిక : 8




## అష్టైశ్వర్య స్వరూపుడైన భగవంతుడు అష్టైశ్వర్యములనూ మనకే ప్రసాదిస్తున్నాడు!

## భూమానందుడనే తన పేరును సార్థకం చేస్తున్నాడు!!

**భ**గవంతుడు అష్టరూపములలో ఈ సృష్టిని ఆవహించి ఉన్నాడు. ఆయన తనకున్న అష్టైశ్వర్యములనూ విశ్వజనులకే ప్రసాదిస్తున్నాడు.

విశ్వమనిన వేరుకాదు; అనేక అంగములతో విస్తరింపబడినదే విశ్వాత్మకుడైన భగవంతుని స్వరూపము. తత్కారణంగానే 'విశ్వం విష్ణు స్వరూపం' అన్నారు.

'విష్ణువు' అంటే విశేషంగా వ్యాపించే గుణం కలవాడనే అర్థం ఉన్నది. ఆయన ఎంతగా వ్యాపించడన్నదీ అనూహ్యం. ఎవరూ లెక్కకట్టి చెప్పలేరు. కనుక ఎంతమేర వ్యాప్తించాడన్నదీ చెప్పలేము. కారణం– ఆయన వ్యాపిస్తూనే ఉంటాడు.

**వి**శ్వం కార్యం! **వి**ష్ణువు కారణం! కార్యకారణమే జగత్తు! కార్యకారణ స్వరూపమైన జగత్తును మనం భగవంతుని విశ్వరూపంలోనే దర్శించగలం. పాంచభౌతికమైన శరీరాన్ని అవయవముల్లో దర్శించగలం, కానీ అష్టైశ్వర్య ప్రదాతయైన భగవంతుణ్ణి అంత సుస్సులభంగా తెలుసుకోలేము, ఆయన్ను ఒకేచోట చూడలేము, కానీ విశ్వంలో వివిధ అంశాలుగా చూడగలం.

విశ్వంలోని మొదటి స్వరూపం జలం. జలం లేకుండా ఏ ప్రాణీ జీవించలేదు. కానీ, అట్టి జలము ఒక్కచోట లేదు. కొన్ని ప్రదేశముల్లో బాహ్యంగా గోచరిస్తుంది, కొన్ని చోట్ల భూపొరల అట్టడుగున ఉంటుంది. కావున జలము భగవంతుని మొదటి స్వరూపము. రెండవది అగ్ని. అగ్ని చేతనే సమస్తమూ వికశిస్తూ, పచనం చేస్తూ, ప్రకటిస్తూ, ప్రదర్శిస్తూన్నది.

మూడవది భూమి. భూమిపైననే సకల ప్రాణులూ జీవిస్తున్నవి. జనన మరణా లన్నీ భూమిపైనే జరుగుతున్నాయ్. తత్కారణంగా భగవంతుని భూమానందుడంటున్నాం. ఆ భూమానందుడనుగ్రహించకుంటే– భూమ్యా కాశములొక్కటియై భూమిపై అష్టైశ్వర్యములను ప్రసాదించెడివి కావు.

భూమానందా! భువి జనులందరినీ అష్టైశ్వర్యముల్ను ప్రసాదిస్తూ అసమాన తేజోవంతులుగ వర్థిల్ల చెయ్! ప్రవర్థిల్లచెయ్!

ఇంతకూ అసలు విషయమేమిటంటే అంతరిక్షయానానికి పూర్వమే, భారతీయుడు సాగరయానం ద్వారా ప్రపంచాన్ని చుట్టివచ్చాడు. ఇంకా ముందు చరిత్రకు వెడితే సాగరాలను త్రవ్వుకుంటూ పోయింది సగర మహారాజు పుత్రులనే విషయం ఇతిహాసికం వివరిస్తుంది. ఐతిహాసికపరంగా ఎన్నో విషయాలు తెలుస్తాయ్. కానీ ఐతిహాసికంగా తెలుసుకొనే వాడెవ్వడు? సి (C) ఏ (A) టి (T) కాట్! కాట్ అంటే 'పిల్లి' అనేవాడే కనిపిస్తాడు.

అలాగే జంబూద్వీపమూ, క్రౌంచ ద్వీపమూ! ఒకదాని వెనుక మరొకటి ఉన్నాయ్! ఒకటి వెల్తురుగా ఉంటే, మరొకటి చీకటిగా ఉంటుంది. కానీ యీ వెల్తురు, చీకటి, ఎండా, వానా, ఋతువులు, వత్సరములు ఈ రెండు ఖండాలలోనూ ఉన్నాయ్! కానీ భరతఖండము నిటారంగా ఎగసింది! అమెరికా ఖండం విస్తరించింది! ఆ విస్తరణలో కూడా భారతీయుల విస్తరణ ముఖంగా ఉన్నది.

జంబూ ద్వీప క్రౌంచ ద్వీపజనులు కలిసికట్టుగా కృషిచేస్తే ప్రపంచ జనుల పురోగమనం అత్యద్భుతంగా ఉంటుంది.

బహుళ సంఖ్యలో భారతీయులు లేకపోవచ్చుగానీ, బహుముఖాలుగా భారతీయుల కృషి ఉన్నది.

ఏ దేశమేగినా, ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్న రాయప్రోలువారి గీతాన్ని స్మరిస్తూంటే ఖండఖండములా భారతఖ్యాతి విస్తరిల్లుతూ ఉంటుందని అస్మదీయుని ప్రగాఢ విశ్వాసం!

బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు




Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



## రాగరాగాలకు అతీతంగా రామభక్తిని కీర్తించిన త్యాగరాజు!

**ఎన్నో వేల కీర్తనలను రచించారు. రాగతాళాలను నిర్దేశించారు. శ్రావ్యంగా ఆలపించారు! ఇప్పటికీ గాయకుల నోట వింటూనే ఉన్నాం! తొలుదొల్త వాగ్గేయకారునిగా కీర్తింపబడ్డారు!**

రామా! శ్రీరామా! రఘురామా! అన్న నామం తప్ప ఆయన పెదవులపై అన్య నామం స్మరింపబడలేదు! ఆయన యెపుడూ రాజాశ్రయం కోరలేదు. రాజే తాను కోరి ఆయన ఇంటికి వచ్చినా, రాముణ్ణి తక్క తన పెదవులు అన్యుణ్ణి స్మరించవని చెప్పారు.

ఇప్పటికి 170 సంవత్సరాలక్రితం తంజావూరు సమీపంలో జీవించిన త్యాగరాజులవారొకసారి తిరుమల వెళ్ళి వేంకటరమణుని దర్శించారు. అప్పటికి అర్చకులు సేవలను ముగించారు. శ్రీవారి ముందున్న తెరలను మూసివేసారు. అప్పుడాయన శ్రీనివాసుని శ్రీరామచంద్రుని అవతారమూర్తిగా సంభావించి, నాలోమత్సరమను తెరతీయగరాదా- అని శ్రీవారిని స్తుతించారు. అందుకనేమో కవి అణ్ణన్ శ్రీవారి సుప్రభాతస్తుతిని 'కౌసల్యా సుప్రజారామా' అని స్తుతించారని నా మనస్సు పునఃపునః చెబుతూంటుంది. ఇంతకన్నా స్తుతి సత్యం ఏముంటుంది? కౌసల్యా సుప్రజా రామా! పూర్వా సంధ్యా ప్రవర్తతే యని నేనూ స్తుతిస్తూంటాను.

త్యాగరాజస్వామివారు జీవించిన కాలం 1767 నుండీ 1847 వరకేనని తెలుస్తూంది. 170 సంవత్సరాల క్రితం ఆయన ఇష్టదైవమైన శ్రీరామ చంద్రునిలో లీనమయ్యారు. ఈ మధ్యకాలంలోనే ఆయన ఎన్నోవేల కీర్తనలను రచించారు. వాటన్నిటికీ రాగతాళాలనూ ఆయనే నిర్దేశించారు.

త్యాగరాజస్వామి జయంతి వర్ధంతిల రోజులను సంగీత విద్వాంసులకు పర్వదినములు.

త్యాగరాజ స్వామివారిని తమ గురువుగా, ఆరాధనా దైవంగా భావించిన బెంగుళూరు నాగరత్నమ్మ త్యాగరాజులవారి సమాధిని నిర్మించినది. అక్కడ నిత్య త్రికాల పూజలు చేస్తూంటారు.

ఆయన పుణ్యతిథినాడు దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉండే ఎందరెందరో గాయనీగాయకులు తిరువాయూరులోని ఆయన సమాధి వద్ద భక్తి ప్రపత్తులతో పంచకీర్తనలను ఆలాపన చేస్తారు.

నేనొక పర్యాయం మా ఆడిటర్ రఘుగారితో తిరువాయూరు వెళ్ళి త్యాగ రాజుల వారి సమాధిని దర్శించాను. ఆ సమాధి మందిరం చుట్టూ ప్రదక్షణలు చేసాను. బీటలు వారిన కావేరీ మట్టి కణాల్లోని జలాలను చూసాను. తంజా వూరులో వారి బంధువుల యింట త్యాగరాజుల వారు పూజించిన సీతారామ పరివార విగ్రహాలను దర్శించాను. సీతారామా మీరెంతటి పూజనీయులు. త్యాగరాజస్వామి వారిచే పరమపవిత్రంగా పూజింపబడ్డారు. మిమ్మల్ని దర్శింపచేసిన పుణ్యసమయం వెనుక త్యాగరాజు స్వామివారి కరుణ మాపై ఉన్నది. కరుణాంత రంగా శ్రీ సీతారామచంద్రా నేనెంత ధన్యుడను- అంటూ పులకించిపోయాను. త్యాగరాజు కమలమ్మ దంపతులక్కడే ఉన్నట్లు భావించాను. ఇంతటి మహద్భాగ్యం ఎందరికి కలుగుతుంది! ఇట్టి మహద్భాగ్యం కలిగించిన రఘుదంపతులకు నా శుభాశీస్సులను ఉప్పటికీ చెబుతూనే ఉంటాను. 'రామా నన్ను బ్రోవరా శ్రీరామా నన్ను బ్రోవరా'- అని నిరతమూ ప్రార్థిస్తూంటాను. ●






## తెలుగు వెలుగుకు దివ్యమైన బాటవేసిన చెన్నయ్ మహానగరం!

చెన్నయ్ మహానగరనేల నణువణువునా తెలుగుదనము కనిపిస్తూంటుంది. ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి, కె.యన్.కేసరి వంటి మహనీయులు చెన్నయ్ మహానగరంలో తెలుగు వెలుగులను ఆరని వెలుగులుగా చిరస్థిర కాంతులుగా ప్రసరించేట్టు చేసారు. కలవల కణ్ణన్ శ్రేష్టివంటివారు అనేక విద్యాసంస్థలను ప్రారంభించారు. చెన్నయ్‌లోని ఆర్యవైశ్యులు ఇప్పటికీని ఆ సంస్థలను కొనసాగిస్తున్నారు. ఆర్య ధర్మంతోబాటు ఆంధ్ర వెలుగును చిరకాలమూ వర్ధిల్లుతూ ప్రవర్ధిల్లేట్టు చేస్తున్నారు. 23 సంవత్సరాలుగా 'ప్రముఖాంధ్ర' ప్రపంచ జనులకు తెలుగు కీర్తిని నిలిచేట్లు చేస్తున్నదంటే చెన్నయ్ మహాజనులే కారణం! తెలుగు వెలుగులు దిశల వెలయడానికి చెన్నయ్ మహానగరం కారణమవుతుంది. చెన్నయ్ నా ఆవాసమైనందులకు ఎంతగానో ఆనందిస్తున్నాను. ఈ ఆనందం చిరకాలం వర్ధిల్లుగాక!





**అగరబత్తి తయారీలో బెంగుళూరు, మైసూరులకున్న పేరును ఏలూరులోని అంబికావారు దత్తం చేసుకున్నారు! ఏలూరులోని ఆలపాటి రామచంద్రరావుగారు అంబికా అగర్‌బత్తీల పేరుకు ఎంతో ప్రాచుర్యం తెచ్చారు! ఆలపాటి ఇంటిపేరు అంబికా ఇంటిపేరుగా మారిపోయింది!! భక్తునికీ భగవంతునికీ అంబికా అగరుబత్తీని అనుసంధానమొనరింపచేస్తూ ఆలపాటి ఇంటిపేరు 'అంబికా' గా సంతరించుకుంటున్నది.**

మైసూరు దర్బార్ అగరుబత్తీకి ఉండే పేరుప్రఖ్యాతులు చాలావరకూ అంబికా దర్బార్ బత్తీకే దత్తమయ్యాయ్! వారు ఆరాధించే 'అంబికా దేవి' వారి ఆరాధనను అనుగ్రహించింది. ఆంధ్రదేశంలోనే గాకుండా భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ, 'అంబికా అగర్‌బత్తీ' పేరు తెచ్చుకున్నది.

ఏలూరులో అడుగిడిన చాలు ఎల్లెడలా 'అంబికా' పేరు వినిపిస్తూనే ఉంటుంది. వారికంత ఖ్యాతిని సిద్ధింపచేసిన అంబికా దేవి పేరిట ఆలయాన్ని నిర్మించారు. వారు నిర్మించిన సినిమా థియేటర్లకు అంబికా పేరును పెట్టారు. చివరికి వారింటిపేరు 'ఆలపాటి' అంబికాలా ప్రాచుర్యం పొందింది.


అగరుబత్తీల మార్కెట్‌ను చూచుకోవడంలో వారి కుటుంబసభ్యుడు అంబికా రాజా ఎక్కువ శ్రద్ధను తీసుకుంటారు. ఆయన స్నేహ పిపాసి, చిరుకవితల అభ్యాసి. స్నేహబృందాలతో పరిచయం ఎక్కువ. 'స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం' అన్నది ఆయన విశ్వాసం, ఆ విశ్వాసంతోనే తన మిత్ర బృందం ద్వారా సమాజిక కార్యక్రమాలను చేస్తూంటారు. మిత్ర బృందాలతో స్నేహంగా ఉంటూంటారు.

అంబికా వారికి ఏలూరులోనే గాకుండా, విశాఖ పట్టణంతో కూడా వ్యాపార సంబంధాలున్నాయ్. వాల్తేరు రైల్వేస్టేషనులో క్యాటరింగ్‌ను వారే నడుపుతున్నారు. కొన్నాళ్ళు విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై క్యాటరింగ్ నడిపారు. రుచ్యకరమైన వంటకాలను అందించడంలో వారి క్యాటరింగ్ పేరు పొందింది. సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలకు వారు బాసటగా ఉంటున్నారు.



భగవంతునికి భక్తునికి అనుసంధానమైనది అంటూ మార్కెట్లోకి దూసుకు పోయింది అంబికా దర్బార్‌బత్తీ. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో పుట్టిన అంబికా దర్బార్‌బత్తీ... తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాలకు విస్తరించింది. ఆలపాటి రామచంద్రరావు ఆవిష్కరించిన ఈ ప్రొడక్ట్‌తో వారి ఇంటిపేరే అంబికాగా మారిపోయింది. ఈ కుటుంబంలో రెండో తరానికి చెందిన అంబికా కృష్ణ ఎ.పి ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా ఉన్నారు. ఈయన సినిమా, రాజకీయ రంగాల్లో ఏకకాలంలో రాణిస్తూ, తన వారసులు రామచంద్ర, రామాంజనేయులను కూడా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దారు. ఎబిఎన్ ఆంధ్రజ్యోతి 'బెస్ట్ ఇన్ ది బిజినెస్'గా ఈ ముగ్గుర్నీ ముచ్చటించింది.

# అనేకానేక భాషా ప్రయోగాలు చేసిన రామా చంద్రమౌళి



చంద్రమౌళి ఎం.ఎస్ చేస్తున్నప్పుడు 'స్పెషల్ అప్లికేషన్ బ్యూరియన్స్ ఇన్ రాకెట్ సిస్టమ్' అంశంపై డిఆర్‌డిఎల్, హైద్రాబాద్‌లో డాక్టర్ అబ్దుల్ కలాంతో కలిసి పనిచేశారు. ఆచార్య ఆత్రేయ వద్ద స్క్రిప్ట్ లిరిక్ రైటింగ్ నేర్చుకున్నారు. కాంచన సీత సినిమాకు దర్శకుడు 'అరవిందన్' వద్ద పనిచేశారు. బొమ్మరిల్లు, డబ్బు డబ్బు డబ్బు, గూటిలో రామచిలుక, జేగంటలు, కులాల కురుక్షేత్రం వంటి సినిమాలకు పనిచేశారు.

**రా**మా కనకయ్య, రాజ్యలక్ష్మి దంపతులకు 8-7-1950లో జన్మించిన రామా చంద్రమౌళి ఎం.ఎస్ (మెకానికల్) ఎఫ్.ఐ.ఇ, పిజిడిసిఎ చదివారు. ప్రొఫెసర్‌గా, వైస్ ప్రిన్సిపాల్‌గా వరంగల్ గణపతి ఇంజినీరింగ్ కాలేజీలో పనిచేస్తున్నారు.

**వీరి నవలలు (17) :** శాపగ్రస్తులు, చారునీళ్ళ, ప్రవాహం, శాంతివనం, తెలిసి చేసిన తప్పు, అమృతం తాగిన రాక్షసులు, వక్రరేఖలు చదరంగంలోని మనుషులు, పిచ్చిగీతలు, రాగధార, నిన్ను నువ్వు తెలుసుకో, పొగమంచు, మజిలీ, దారితప్పిన మనుషులు, ఎడారిలో చంద్రుడు, ఎక్కడ నుండి ఎక్కడికి? మొదలగునవి రచించారు.

అలాగే 'తెగిన చుక్కలు', 25 ఏళ్లనాటి 25 కథలు జననీభీభత్సం, మరణ సౌందర్యం అనే 3 కథా సంపుటాలు ప్రచురించారు. దాదాపు 102 కథలు ప్రచురింపబడ్డాయి. ఇక వీరి కవితా సంపుటాలు. దీపగ్ని(1971), శిలలు వికసిస్తున్నాయి (1979), స్మృతిధార (1984) ఎటు? (2004) కిటికీ తెచరిన తర్వాత(2006) ద్విభాషా సంకలనం(ఇంగ్లీష్, తెలుగు) (ఆటా సభల్లో 2006లో ఆవిష్కరించబడింది)

అంతర్దహనం ఒకే దేహం... అనేక మరణాలు, మూడు స్వప్నాలు ఒక మెలకువ (సంయుక్తంగా) వంటి విశిష్టమైన కవితా సంపుటాలను వెలువరించి రామచంద్రమౌళి ఎందరికో మార్గదర్శకులుగా నిలిచారు.

వీరి సాహిత్యంపై కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్య కె.యాదగిరి నేతృత్వంలో రామాచంద్రమౌళి- సమగ్రసాహిత్యం పరిశోధన అంశంపై జ్వలితచే పి.హెచ్.డి. చేస్తున్నారు.

అలాగే కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్‌లో ఆచార్య కాత్యాయినీ విద్మహే నేతృత్వంలో రామాచంద్రమౌళి- కథలు అంశంపై ఎంఫిల్ పరిశోధప జరుగుతున్నది. వీరి నవలలపై ఆచార్య జ్యోతి నేతృత్వంలో "రామాచంద్రమౌళి- నవలలు" అంశంపై ఎంఫిల్ పరిశోధన జరుగుతున్నది.

Whither? and other Ppoems ఆంగ్లభాషలోకి కవితల అనువాదం 2007లో విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో ఆవిష్కరించబడినది.

Infermo ఆంగ్లానువాదం స్వాతి శ్రీపాదచే చేయబడినది. 'ఎడారిలో చంద్రుడు' (నవల), 'చదరంగంలో మనుషులు' కన్నడంలోకి అనువదించబడ్డాయి. 8 కథలు ఇంగ్లీష్, కన్నడ, తమిళ, పంజాబీ భాషల్లోకి అనువదించబడ్డాయి. అనేక కవితలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో Indian Literature, Poets & Writers వంటి ప్రముఖ పత్రికల్లో ప్రచురించబడ్డాయి.

2004 నుండి 'సృజనలోకం' తరపున ప్రధాన సంపాదకత్వంలో కవితా వార్షిక 2004, 2005, 2006, 2007 సంచికలు వెలువడ్డాయి.

ఇండియా టుడేకు ప్యానల్ రివ్యూవర్‌గా ఎన్నికయ్యారు. ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీచే 2007 సం. కోసం వరంగల్‌లో నిర్వహించిన 'కవిత సంధి' కార్యక్రమానికి 1996 నుండి ఎంపిక చేయబడ్డ 3వ కవిగా 29.06.2007న పాల్గొని కార్యమాన్ని విజయవంతం చేశారు.

డిసెంబర్ 2006లో 11th India Poetry Festival కు ముఖ్య అతిథిగా 3 అక్టోబర్, 2007న ఆగ్రాలో 3వ ఇంటర్నేషనల్ రైటర్స్ ఫెస్టివల్‌కు అధ్యక్షత వహించారు.

ఎం.ఎస్ చేస్తున్నప్పుడు 'స్పెషల్ అప్లికేషన్ బ్యూరియన్స్ ఇన్ రాకెట్ సిస్టమ్' అంశంపై డిఆర్‌డిఎల్, హైద్రాబాద్‌లో డాక్టర్ అబ్దుల్ కలాంతో కలిసి పనిచేశారు.

ఆచార్య ఆత్రేయ వద్ద స్క్రిప్ట్ లిరిక్ రైటింగ్ నేర్చుకున్నారు. కాంచన సీత సినిమాకు జాతీయ దర్శకుడు 'అరవిందవ్' వద్ద పనిచేశారు. బొమ్మరిల్లు, డబ్బు, డబ్బు, గూటిలో రామచిలుక, జేగంటలు, కులాల కురుక్షేత్రం వంటి సినిమాలకు పనిచేశారు.

ఇంజినీరింగ్ పాఠ్యపుస్తకాలు 1. ఇంజనీరింగ్ డ్రాయింగ్, 2.డిజైన్ ఆఫ్ మెకానిక్ ఎలక్ట్రానిక్స్, 3. ఇంజనీరింగ్ మెకానిక్స్, 4. ఇంజినీరింగ్ మెటాలజీ, 5.సాలిడ్ మెకానిక్స్ తదితర పుస్తకాలు రచించారు.

వీరు తెలుగు విశ్వవిద్యాయలం కవితా పురస్కారం (2007) సి.నా.రె. కవితా పురస్కారం(2008), జి.ఎం.ఆర్. రావి కృష్ణమూర్తి కథా పురస్కారం (2008), ఏపి పాలటెక్నిక్ అధ్యాపక అవార్డు (2000), సరోజినాయుడు జాతీయ పురస్కారం (కులాల కురుక్షేత్రం సినిమాకు), ఉమ్మెతల సాహితీ పురస్కారం (1986) నూతలపాటి గంగాధరం సాహిత్య పురస్కారం(1986) భాగ్య అవార్డు(2005), ఆంధ్రసారస్వత సమితి పురస్కారం(2006), అలాగే అనేక పోటీలతో వారు అవార్డులు పొందడం జరిగింది.

క్రియాశీలకంగా నిత్యనూతనంగా అభ్యుదయ మార్గంలో మానవతా విలువలు కలిగి రచనా వ్యాసంగాన్ని నిరంతరం కొనసాగిస్తున్న ఈ కవి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల పరంపరను సునిశితంగా పరిశీలించడం, స్పందించడం ఈ కవి ప్రత్యేకత.

**(2017 ఫిబ్రవరి ఆదివారం ఆంధ్రప్రభకు కృతజ్ఞతలతో)**




**నువ్వు ఏం రాయబోతున్నావు? - కను కవ్వు కఏం కచ కదు కవు కతా కనం కటే కఅ కది! ఇది బేసిక్ ‘క’ లాంగ్వేజ్. ఇదివరకటి కాలంలో యూత్- అంటే ఇప్పటి బామ్మలు తాతయ్యలు ఈ భాషలో ఉద్దండులు. ఏ టైపు సందేశమైనా రహస్యంగా ఇచ్చిపుచ్చుకోవటానికి ఈ భాషను వాడేవాళ్లు. ఇది వాడటం చాలా తేలిక. ఎందుకంటే ఒకే ఒక అక్షరం ఉంటుంది కాబట్టి. మన భాషలోని పదాలను విడగొట్టి ప్రతి అక్షరం ముందు ‘క’ చేర్చి మాట్లాడటమే ‘క’ భాష. ‘క’ భాషలో సాహిత్య గోష్ఠులూ అవధానాలూ వంటివి జరిగేవి.**

బెల్ బాటమ్ కుర్రాళ్లు, జార్జెట్‌వోణీ అమ్మాయిలు కాలేజీల్లో, సంతల్లో ఎక్కడపడితే అక్కడ ఎంతో విరివిగా ‘క’ భాషను వాడేవారు. పార్కుల్లో చెట్లమీద, గుళ్ళలో, ప్రసాదం కోసం గుడి గట్లమీదా కూర్చున్న నల్లరంగు జాతిపక్షులు ప్రజలు వాడే ఈ భాషను క్రమక్రమంగా నేర్చుకున్నాయట. అయితే, మన భాష వాటికి రాదు కాబట్టి, ఉత్త ‘క’ను పట్టుకుని ‘కాకులు’గా ప్రసిద్ధి చెందాయి. కాకిగోల రాన్రానూ ఎక్కువైపోయి మనుషులు ‘క’ భాషను ఛీత్కరించి మరుగున పడేశారు. ఆ విధంగా ‘క’ భాష అంతరించిపోయింది.

గతంగతః గతించిపోయిన భాషల గోల మనకేల?

వర్తమాన భాష ‘కీ’ భాష. అంటే కీబోర్డు భాష అన్నమాట. ఈ రోజుల్లో పదాల్లో అయినా, బట్టల్లో అన్నీ షార్ట్ ‘కట్లే’! అందుకే కీ బోర్డు భాషని షార్ట్‌గా స్మార్టుగా ‘కీ’ భాష అంటారు. ఈ కీ భాష టైప్ చేసేవాళ్లకి మాత్రమే తెలిసిన షార్ట్‌కట్లు ఉంటాయి. అవి తెలిస్తేనే ఆ సందేశాన్ని డికోడ్ చేయగలం. ‘యు’ అంటే వైఓయు అనే బేసిక్స్ ఎబిసిడిలు రాని పిల్లాడిక్కూడా తెలుసు. ఇటువంటి లెక్కలేనన్ని ఉన్నాయి. కీ భాషలో మాండలికాలు ఎన్నో! ఎస్సెమ్మెస్సుల్లో వాడే ‘కీ’ బాష వేరు. ఛాటింగ్‌ది వేరు. కామెంట్స్ వేరు. ఎగ్జామ్స్‌లో వేరు, ఫ్రెండ్స్‌తో, బయటివాళ్లతో, ఇంట్లో వాళ్లతో అన్నీ వేరే. దేనికి దానికే కేజీ నుంచి పీజీ దాకా లెవెల్స్ ఉన్నాయి. దీన్లో ప్రతిభ కనబరచిన వారికి ఒక బంగారు తాళంచెవి బహూకరిస్తారు. అంటే ‘కీ’ ఇస్తారు. ‘కీ’ ఇచ్చి వదిలిపెట్టిన యూత్ అంతా వారి చెల్లెళ్లకీ, తమ్ముళ్లకీ ‘కీ’ భాష నేర్పిస్తారు. దీన్ని ఒక భాషగా గుర్తించి పాఠ్యాంశాల్లో చేర్చాలనీ, అసలు మొత్తం టెక్స్ట్ బుక్సే ఈ భాషలో ఉండాలనీ ‘కీ’ ఇచ్చిన నాయకులు చాలామంది ఆందోళనలు, ఉద్యమాలు చేస్తున్నారు. గ్లోబల్ విలేజ్ లింగ్విస్టిక్స్ వీరి తాకిడిని తట్టుకోలేక ఏదో ఒక రోజు దిగివస్తుందని వీరంతా బలంగా నమ్ముతున్నారు.

‘కీ’ భాష రహస్యాలు ఇంకా శోధించాలని డాక్టర్ భాషాను ఇంటర్వ్యూ చేశారు. డాక్టర్ భాషా ఆసక్తి గొలిపే ఎన్నో వివరాలు చెప్పారు. కీ భాషలో పండితులు ఎబిసిడి అని వరుసగా చెప్పలేరు. క్యూడబ్ల్యూ ఇ ఆర్ టి వై అని కీ కీ బోర్డు మీద ఉన్న పద్ధతి ప్రకారమే చెప్పగలరు. షార్ట్‌కట్‌లో క్వేర్టీ అని కూడా అంటారు. ఆశ్చర్యం ఆనందం కలిగితే ‘ఓ మై గాడ్’ అని మొత్తం అనకుండా ఓఎమ్‌జి అంటారు. కోపమో, చిరాకో వస్తే డబ్ల్యుటిఎఫ్. ఇప్పుడే వస్తాను అనటానికి బిఆర్‌బి, కిందపడి దొర్లి దొర్లి నవ్వుతున్నాను అనటానికి ఆర్‌ఓఎఫ్‌ఎల్, బాగున్నాను అనటానికి ఎఫ్ 9, ఆల్‌రైట్‌కి ఎఎల్‌ఆర్8, హౌఆర్యూకి హెచ్‌ఆర్‌యు, ఆల్‌దిబెస్ట్‌కి ఎటిబి, ఐలవ్యూకి ఇలు, గాడ్ బ్లెస్ యుకి జిబివై.

ఇక ఇంగ్లీష్ పదాల్లో వోవెల్స్ పీకి పారేసి నంబర్ అంటే ఎన్‌బిఆర్, గుడ్‌నైట్ అంటే జిడిఎన్‌టి, వెయిటింగ్‌కి డబ్ల్యు8ఎన్‌జి, హేవింగ్ లంచ్‌కి హెచ్‌విఎన్ ఎల్ఎన్‌సిహెచ్– ఇలా అన్ని పదాలకీ షార్ట్‌కట్లే. ఇంగ్లీష్ కూడా ‘కీ’ భాష ముందు ఓడిపోయి అంతరించడానికి సిద్ధంగా ఉంది. 160 కారెక్టర్లలో మనసంతా నిండిపోయిన భావాలు చెప్పాలంటే కష్టమే. ఆఫీసులో కీబోర్డుమీద ఒక్కో అక్షరం వెతుక్కుంటూ టైప్ చెయ్యడం కష్టమే. టచ్‌స్క్రీన్ మీద అన్నన్ని అక్షరాలు టచ్ చెయ్యాలంటే స్క్రీన్ పాడైపోతుంది? అందుకే ఈ కటింగ్‌లు” అని డాక్టర్ భాషా చెప్పారు. ఇంకా, ఈయన ఒక కొత్త రోగాన్ని గుర్తించారు. రోజూ అంట్లు తోమేవాళ్లకి గోళ్లు ఎలా అరిగిపోతాయో, అలా కీ భాష ఉపయోగించేవారికి బొటనవేలు అరిగిపోతుందిట. మన నెక్స్ట్ జనరేషన్ ఈ జెనెటిక్ డిజార్డర్‌తో పుట్టకుండా టచ్‌స్క్రీన్ కనిపెట్టారు. దానివల్ల చూపుడు వేలు అరిగిపోతుంది. ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోవాలంటే నోరయినా తిరగాలి. వేలయినా అరగాలి! పైగా పక్కనే ఉన్న వ్యక్తితో కూడా మనం ఈ విధంగా మాట్లాడుతుంటే కళ్ళెత్తి లేదా తలతిప్పి చూడాల్సిన అవసరం ఉండదు. కాబట్టి క్లాస్‌లో టీచర్ కాదు కదా, శాటిలైట్ మీద బ్రహ్మ కూడా కనిపెట్టలేడు!

అదీ ‘కీ’ భాష కథ! కాబట్టి ఏవో డిగ్రీలూ, పీజీలూ చేశామని మురిసిపోయి విశ్రాంతిగా పడుకుంటారేమో! రాబోయే రోజుల్లో కీ భాష ఎక్స్‌పర్ట్సే రాజులు. స్టార్ట్ యువర్ ఎల్కేజీ ఎగైన్! ●

**కీ భాషలో మాండలికలు ఎన్నో!
ఎస్సెమ్మెస్సుల్లో వాడే ‘కీ’ భాష వేరు.
ఛాటింగ్ ది వేరు. కామెంట్స్‌లోది వేరు.
ఎగ్జామ్స్‌లో వాడేది వేరు. ఫ్రెండ్స్‌తో, బయటివాళ్లతో,
ఇంట్లో వాళ్లతో అన్నీ వేరు వేరు!
దేనికి దానికే కేజీ నుంచీ పీజీ దాకా
లెవెల్స్ ఉన్నాయి.**

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com



సముద్రతీరంలో ఉన్న తిరుచెందూరు ఆలయం, పక్క దేవేరుల సమేతుడైన తిరుచెందూరు శ్రీసుబ్రహ్మణ్యస్వామి

# సాగరతీర సుబ్రమణ్యేశ్వరుడు తిరుచెందూర్!

ఓంకారానికి ప్రతిరూపమైప సుబ్రహ్మణ్యస్వామి వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రంగా తిరుచెందూరు విరాజిల్లుతోవది. కోరిన కోర్కెలు తీర్చి సుఖ సంతోషాలను, భోగ భాగ్యాలను కల్పించే కరుణామయుడుగా స్వామి వారు సేవలందుకుంటున్నారు. దేవతలను రక్షించడానికి సూరపద్మాసురుడనే రాక్షసుడిని సంహరించిన స్థలంగా తినుచెందూరు ప్రసిద్ధిగాంచింది.

**స్వామి వారి అవతారం:**

కైలాసంలో శివపార్వతులు తపస్సు చేసుకుంటారు. ఆ సమయంలో దేవతలంతా వచ్చి తమను సూరపద్మాసురుడనే రాక్షసుడి భారి నుంచి రక్షించాలని వేడుకుంటారు. దీంతో దేవతలకు పరమేశ్వరుడు అభయమిస్తాడు. అనంతరం నీలకంఠుడు ఆరు ముఖాలతో పార్వతిదేవికి, దేవతలకు సాక్షాత్కరిస్తాడు. అప్పుడు స్వామివారి త్రినేత్రం నుంచి సూర్య తేజస్సుతో ఆరు రూపాలు వెలువడ్డాయి. ఆ రూపాలతో పార్వతీదేవి భయపడుతుంది. ఆ రూపాలన్నీ పరమేశ్వరుని ఎదుట నిలబడతాయి. స్వామివారు అగ్ని, వాయు దేవతలను పిలిచి, తన ముందు నిలిచిన ఆరు దివ్య తేజస్సు రూపాలను గంగానది తీరంలోని మూలికల పొదల్లో ఉంచి రావాలని ఉపదేశిస్తాడు. శివుని ఆదేశం మేరకు అగ్ని, వాయువులు ఆ ఆరు తేజస్సులను మూలికల పొదల్లోని ఆరు తామర పువ్వుల నడుమ ఉంచుతారు. అప్పుడు ఆ రూపాలు ఆరు అందమైన శిశువులుగా మారుతాయి. కాగా మహావిష్ణువు ఆ శిశువుల సంరక్షణకు కార్తీక స్త్రీలను నియమించి భక్తి శ్రద్ధలతో పెంచాలని ఆదేశిస్తాడు. ఇదిలా ఉండగా తేజస్సు రూపాలను చూసి భయపడి వెళ్లిన పార్వతీదేవి కాలి అందెల నుంచి రాలిన 9 రత్నాల నుంచి 9 మంది కాళికాస్త్రీలు జన్మిస్తారు. కాగా గంగానదీ తీరంలో విహారానికి వెళ్లిన పార్వతీదేవికి శివుని తేజస్సు రూపాల ప్రతిరూపమైన శిశువులు కనిపించడంతో ఆమె వారిని దగ్గరకు చేర్చుకుంటుంది. ఆరుగురు శిశువుల ఒకేరూపమై సుబ్రహ్మణ్యస్వామిగా మారుతారు. ఆయనకు సహాయంగా ఉండాలని నవవీరులను పరమేశ్వరుడు ఆజ్ఞాపిస్తారు. వీరబాహువుతో పాటు తక్కిన సోదరులు సుబ్రహ్మణ్యస్వామికి తోడవుతారు.

**స్థల పురాణం చెప్పాలంటే-**

సూర్యపద్మాసురుడనే రాక్షసుడు దేవతలను చిత్రహింసలు పెడుతుండడంతో సుబ్రహ్మణ్యస్వామి అతడిని సంహరించడానికి వస్తాడు. ముందుగా సూరపద్మాసురునికి అండగా నిలిచిన తారకాసురుడిని సంహరిస్తాడు. దీంతో భయపడిన సూరపద్మాసురుడు మామిడిచెట్టుగా మారిపోతాడు. ఇది గుర్తించిఒన స్వామివారు తన వేలాయుధంతో చెట్టును రెండుగా చీల్చి సూరపద్మాసురుడిని అంతమొందిస్తాడు. అనంతరం స్వామి తిరుచెందూరులో సేదతారుతారు. దీంతో దేవతలంతా స్వామిని కీర్తించారని స్థలపురాణం చెబుతోంది. ఈ స్థలానికి వెట్రినగర్, జయంతిపురం అనే పేర్లు కూడా ఉన్నాయి. దేవతల గురువైన బృహస్పతి ఈ స్థలంలోనే స్వామిని ప్రార్థించారని ప్రతీతి.

**ఆలయ నిర్మాణం**

ఆలయం దక్షిణ దిశవైపు చూసేలా ఉంది. పశ్చిమ దిశలో రాజగోపురం 137 అడుగులతో నిర్మించారు. రాజగోపురంపూ తొమ్మిది పవిత్రకలశాలను ఏర్పాటుచేశారు. ఆలయ నిర్మాణం ఓం అనే ప్రణవ మంత్ర రూపంలో నిర్మించి ఉండడం విశేషం. రాజగోపురం నిర్మాణ సమయంలో స్వామివారే మనిషి రూపంలో వచ్చి రాజగోపురం నిర్మాణ పనులు చేపట్టిన కూలీలకు విభూదిని ప్రసాదంగా ఇచ్చారని, తరువాత ఆ విభూదే కూలి డబ్బులుగా మారిందని భక్తుల విశ్వాసం. ఆలయంలో రెండు చోట్ల స్వామివారు కొలువై ఉన్నారు. తూర్పుదిశలో ఉన్న సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామిగాను, దక్షిణదశలో షణ్ముఖ స్వామిగాను భక్తులను కటాక్షిస్తున్నారు. వల్లీదేవసేన సమేత షణ్ముఖ స్వామిగాను భక్తులను కటాక్షిస్తున్నారు. వల్లీదేవసేన సమేత షణ్ముఖ స్వామి ఆరు ముఖాలతో 12 హస్తాలతో భక్తులను అనుగ్రహిస్తున్నారు. అలాగే సూరపద్మాసురుని సంహారంలో స్వామికి తోడుగా నిలిచిన వీరబాహువుకు ఇక్కడ ప్రత్యేక సన్నిధి ఉంది. ఆలయంలో జయంతి నాదర్, కుమార వికటంగా పెరుమాళ్, అలై వాయ ఉగంద పెరుమాళ్, నటరాజస్వామి ఉత్సవమూర్తుల సన్నాధిలె ఉన్నాయి. తిరుచెందూరులో కల ఎనిమిది రథ వీధుల్లో స్వామివారి ఊరేగింపు ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఉత్సవాలు జరుగుతూండే తిరుచెందూరులో ఆలయంలో తమిళ సంవత్సరాది, ఆంగ్ల సంవత్సరాది, చైత్ర మాస ఉత్సవం, విశాఖ నక్షత్రం ఉత్సవం, కృత్తిమ ఉత్సవాలు వైభవంగా అల్పిశి నెల శుక్లపక్ష ప్రథమ తిథి **(తరువాయి 10వ పేజీలో)**



# చైనావాళ్ళు ఊహకందని వ్యూహకర్తలు

# తొమ్మిది గంటల్లోనే రైల్వే స్టేషన్ నిర్మాణం

## నిర్విరామంగా శ్రమించిన 1500 మంది చైనా ఉద్యోగులు

**తొమ్మిది గంటల్లోనే వాళ్లొక రైల్వేస్టేషన్ నిర్మించారు. అద్భుతాల్లో కెల్లా అద్భుతమైన విషయాన్నీ దిగువ పొందుపరుస్తున్నాం.**

నిర్మాణరంగంలో దూసుకుపోతున్న చైనా తాజాగా మరో రికార్డు సృష్టించింది. చైనాలోని మూడు ప్రధాన రైల్వే ట్రాకులను అనుసంధానం చేయడానికి ఉపయోగపడే నాన్‌లాంగ్ రైల్వేస్టేషన్‌ను కేవలం తొమ్మిది గంటల్లోనే సిద్ధం చేసింది. పట్టాల అమరిక, సంకేతాలనిచ్చే సాంకేతిక, పర్యవేక్షించే సామగ్రిని 1500 మంది రైల్వే సిబ్బంది శ్రమించి సాధించారు. రూ. ఏడు లక్షల కోట్లలో చైనా దేశవ్యాప్తంగా నిర్మిస్తున్న హైస్పీడ్ రైల్వే వ్యవస్థలో 247 కిమీ పొడవైన నన్సన్‌లాంగ్ కూడా ఒకటి. తాజాగా నిర్మించిన స్టేషన్ కూడా ఇందులో భాగమే. కొత్త స్టేషన్ కారణంగా మధ్య ఆగ్నేయ చైనాల మధ్య ప్రస్తుతం ఏడుగంటలు పట్టే ప్రయాణం ఇకపైగంటన్నరకై పూర్తికానుంది.

---

**(9వ పేజీ తరువాయి)** నుంచి ఆరు రోజులపాటు స్కంధషష్ఠి ఉత్సవాలను నిర్వమించి, సూర సంహార ఉత్సవం ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో లక్షలాది భక్తులు పాల్గొని స్వామివారిని సేవించుకుంటారు. ఆ సమయంలో అనేక ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు పాదయాత్రగా ఆలయానికి వచ్చి హుండీలో తమ బంగారు తాళిని (మాంగల్యం) కానుకగా వేస్తారు. అక్కడే మరో నూతన తాళిని ధరించి వెళతారు.

### ఆలయ పునరుద్ధరణ చేసిన రాజులు

శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని అనేకమంది రాజులు ఆయా కాలాల్లో పునరుద్ధరించారు. చేర, పాండ్య రాజులు ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. వరగుణ మారన, విక్రయ పాండ్యన్ రాజులు అనేక మాన్యాలను ఇచ్చారు. 1729 నుంచి 1758 కాలంలో తిరువాంకూరు మహారాజు మార్తాండ మహారాజు ఆలయ అభివృద్ధి పనులు చేపట్టారు. మౌనస్వాములు, వల్లి నాయకస్వాములు ఆలయ రాజగోపురం, ప్రాకార నిర్మాణ పనులు చేపట్టారు. ప్రఖ్యాత వీరుడు వీర పాండ్య కట్ట బొమ్మన్ ఆలయానికి అనేక మాన్యాలను, కానుకలను సమర్పించారు. అదే విధంగా 1803లో వాషింగ్టన్ అనే కలెక్టర్ ఆలయానికి అనేక మాన్యాలు అందజేశారు,

### వెళ్ళే మార్గం

చెన్నై ఎగ్మూరు నుంచి ప్రత్యేక రైలు వసతి, బస్సు సౌకర్యం ఉంది. అదేవిధంగా తిరుపతి నుంచి నాగర్‌కోవిల్ ఎక్స్‌ప్రెస్, మదురై ఎక్స్‌ప్రెస్ ద్వారా కూడా మదురై వెళ్లి అక్కడ నుంచి తిరునెల్వేలి మార్గంలో తిరుచెందూరుకు వెళ్లవచ్చు. ●






### *నాన్నా! నీ గురించే పాటా లేదేమయా?*

***అమ్మ గురించి పాటలెన్నో ఉన్నాయి!***
***కానీ నాన్న గురించి పాడినవారెవరు?***
***నిజం నాన్నా!***
***నాన్నంటే అన్‌సంగ్ హీరో!***
***నాన్నంటే ఒక ఒంటరి పర్వతం!***
***నాన్నంటే నీ మూలధాతువు!***
***మూలధాతువు లేకుండా ఆయుధమూ, ఆభరణమూ పుట్టదు.***
***దేహము, విజ్ఞానము, దేశమూ, బ్రహ్మోపదేశమూ నాన్నే!***
***నా అన్నవాడూ నాన్నే!***

(2017 ఆగస్టు ఓ కవితా పత్రికలో అరుణ్‌సాగర్ కవితకు సారాంశంగా, సాధనంగా, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ)



# 'వెదురుపాక' గ్రామంలో ఒకేసారి రెండు సంక్రాంతి పర్వాలు
## వెదురుపాక గ్రామంలో రెండు సంక్రాంతి పండుగలు జరుగుతాయ్!
## ఒకటి మకర సంక్రాంతి! రెండవది గాడ్‌గారి పుట్టిన క్రాంతికర పండుగ

వారధి నవలీల దాటవచ్చు
వాయురాకాశ వెలుగు నింపు తారల నెన్నవచ్చు!
భారతార్థ మెరిగి భాషింపవచ్చు!
సూర్యచంద్రవంశజుల యశః కీర్తిని వర్ణించవచ్చు!
వెదురుపాకలో మా గాడ్ బావ నిత్య నిరతాన్న దాన వైభవము నెంచగలమే!
పుట్టగానే 'గాడ్డా' అని పిలిచింది అమ్మమ్మ.
భవిష్యత్తులో విజయేశ్వరీదేవి మంత్రోపదేశం చేసి మహనీయుణ్ణి కావించింది!

అద్దాల బిడ్డగానే 'గాడ్' అని పిలిపించుకోగలిగాడు.

ఆ ఊరిలోకి అడుగిడితే చాలు 'గాడ్' గార్ని చూడ్డానికి వచ్చారా?' అని ఊరి వాళ్ళడుగుతారు.

విజయదుర్గ తల్లీ
ఇవ్వడమేగాని పుచ్చుకొనుటెరుగని ఇనకలేశుడు!
వాసిగల వాడ్రేవు వంశజుడు! వాడవాడలకు గాడ్ అయ్యాడు వెదురుపాక గాడ్.

సంక్రాంతి వెదుతూ, వెదుతూ అక్కడి కాంతులను బోసి పోనివ్వదు.

భోగి పండుగ మంటలు వీధులందు వెలుగుతూనే ఉంటాయి.

బోసి పాపల నుంచి బోసి తాతల నవ్వుల వరకూ వీధి వీధినా పండుగ వాతావరణం ఉంటుంది.

ఆకాశమంత ఎత్తును చుంబిస్తుంటుంది అనురాగం
అణువుణువునా చిందులేయిస్తుంది.
అలాటి మా బావ వాడ్రేవు బావకు 81 ఏండ్లట
కానీ పద్దెనిమిదేండ్ల వర్చస్సు ముఖబింబంలో బింబిస్తూంటుంది

రాకాసుధాకరుడొక్క పూర్ణిమనాడే పరిపూర్ణ చంద్రికలతో భాసిల్లుతాడు. కానీ వెదురుపాక గాడ్ బావ ముఖబింబంలో అనుదినమూ పున్నమి వెన్నెలలు భాసిస్తూనే ఉంటాయి. ఏ మహాత్మ్యమో ఏ మహత్తర చంద్రికల ప్రభావమోగానీ వెదురుపాక గాడ్ నిలయంలో అమావాస్య చొరబడడానికి చొరవ తీసుకోదు.

ఊరిలోకి అడుగిడుతూనే చాలు, 'గాడ్' గారిని చూడడానికి వచ్చారా? వెళ్ళండి బాబూ! ఆయన పరమాత్మా స్వరూపుడు. ఈ వీధి మధ్య మలుపు తిరిగితే చాలు! ఓ పెద్ద యిల్లు కనిపిస్తుంది. వీధి గుమ్మంకడ కాళ్ళు కడుక్కుని వెళ్ళండి. మీతో ఏమైనా దుష్టశక్తులు వెన్నంటి వస్తుంటే గుమ్మంకడ కాళ్ళు కడుక్కోగానే వెళ్ళిపోతాయ్. పై అంతస్తులో గాడ్ గారిచే ప్రతిష్ఠితమై వున్న విజయదుర్గా దేవికి కుంకుమ పూజ చేసి నొసట పూజా కుంకుమ ధరించి వెళ్ళండి. సకల పాపాలూ సంహరింప బడతాయ్. క్రింద కుంకుమధారియై సదా చిదానందంతో ఉన్న సిద్ధపురుషుడు 'గాడ్'గారే మీకు దర్శనం యిస్తారు. మిమ్మల్ని పలుకరిస్తారు.

ఆయన మోములో ఒక ప్రసన్నత కనిపిస్తుంది. రారా, రామ్మా అని పిలుస్తారు. ఒకసారి వీపు తడతారు. ఓ నవ్వు విసురుతారు. ఉన్న బాధలన్నీ ఒక్క పెట్టున పటాపంచలమైపోతాయ్. ఒంట్లో ఎక్కడలేనీ శక్తి వస్తుంది. ఒక్కసారి గోటేటి గారు మరదలు కక్కుకుంటూ వెళ్ళింది. గ్రక్కున యింత పూజాకుంకుమం తీసుకుని ఆమె నోట కొట్టారు. వాంతుల భీతిల్లి పారిపోయాయి. మరల ఈనాటివరకూ ఆఁవిడకు వాంతులే రాలేదు. ఇదాగాడ్ మహిమాన్విత శక్తి.


ఎక్కడా మొక్కుబడి హుండీలు ఉండవు. అమ్మవారి హారతి పళ్ళెం నుంచీ గాడ్‌గారి ఆశ్రమంలో ఎచ్చోటా ముడుపులుండవు. విరాళాలు తీసుకొనే వారు ఉండరు. ఆయన్ని దర్శించి ఆశీర్వాదములు పొంది, షడ్రుచులతోగల ఉచితాతన్న ప్రసాదం స్వీకరించి రావచ్చు.

ఆర్తితో వచ్చినవారూ, ఆత్మీయతా భావంతో వచ్చినవారూ ఆయన్ను దర్శించి, అనన్తరమే భుజించి, రాగల సుక్షేత్రం గాడ్‌గారి బృహద్భవనం.

ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుగుతాయ్. అందరికీ, భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులైతే ఆ వూరి వారికీ ఆయన భక్తులకూ నాలుగో రోజూన వచ్చే 17వ తేదీ నాలుగో రోజు పండుగ.

నోరారా 'గాడ్' అనరా! నోటికెంతో 'గుడ్'రా అంటుంది మనం. ●

# అక్షరక్రమంలో తొలి అక్షరం 'అ'
# 'అ' అంటే అమ్మ!
# అమ్మ వొడి గర్భగుడి!



## చిన్మయానందుడు చాగంటి కోటేశ్వరరావు!

'అమ్మ వొడి గర్భగుడి' - అంటూ చాగంటి కోటేశ్వరరావు గారు కడుచక్కగా విపులీకరించారు. చక్కగా వివరించిన వారి వ్యాసాన్ని ఇందుదహరిస్తున్నాం.

ఏమీ తెలియని పసికూన దగ్గర్నుంచి, వృద్ధులు, జ్ఞాని వరకు నమస్కరించడానికి యోగ్యమైనదీ, ఉద్ధరణకు హేతువైనదీ, కంటి ముందు మాంసనేత్రాలతో దర్శించడానికి యోగ్యమైనదీ. భూమిపై తనతోపాటు తిరుగుతున్న పరబ్రహ్మ స్వరూపం - అమ్మ ఒక్కటే!

అమ్మ పరబ్రహ్మ స్వరూపిణి ఎలా అయింది? ఎక్కడ సృష్టికర్త, స్థితికర్త, ప్రళయకర్త... మూడూ కలిసిన రూపంగా భాసిస్తుందో దాన్ని 'పరబ్రహ్మ స్వరూపం' అంటాం. ఆ పరబ్రహ్మ - సృష్టి చేసినప్పుడు బ్రహ్మగా దాన్ని నిలబెట్టినప్పుడు, పోషించినప్పుడు స్థితికర్తయైన శ్రీ మహావిష్ణువుగా, లయం చేసినప్పుడు మహేశ్వర స్వరూపంగా నిలబడుతుంది. ఎవరిలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు - ముగ్గురూ కలిసి ప్రచోదనం అవుతారో, ఆ ముగ్గురూ కలిసి ఒక ముగ్ధరూపంగా కళ్ళముందు కనబడతారో దాన్నే 'పరబ్రహ్మ స్వరూపం' అని పిలుస్తాం.

మానవ ధర్మంలోని గొప్పతనం ఏమిటంటే - దేవతా స్వరూపాలలో చాలావాటిని మనం పరబ్రహ్మ స్వరూపాలుగా కీర్తిస్తాం. ప్రత్యక్షంగా కంటితో దర్శనం చేయడానికి యోగ్యమైన పరబ్రహ్మ స్వరూపాలలో ఒకటి - సూర్యనారాయణమూర్తి. ఆయన సృష్టికర్త, స్థితికర్త, ప్రళయకర్తల సమాహార స్వరూపమై ఉంటాడు. 'ఆదిత్య హృదయం'లో దాన్నే వాల్మీకి మహర్షి చక్కగా వర్ణన చేస్తాడు. తిక్కన సోమయాజి కూడా 'మహాభారతం'లో "హరిహర బ్రహ్మ" అంటాడు. "సృష్టికర్త, స్థితికర్త, ప్రళయకర్త... ముగ్గురూ కలిసినప్పుడు ఏర్పడిన ముద్ద... మాంస నేత్రాలకు గోచరమై, తూర్పు దిక్కున ప్రకాశిస్తున్నది. అదే పరబ్రహ్మం" అన్నాడు.

అలాంటి పరబ్రహ్మ స్వరూపం అమ్మ. అమ్మే దేవతా స్వరూపం. ఉద్ధరణ హేతువు. ఏ కారణంతోనో అమ్మకు 'మాతృదేవోభవ' అని తొలి వందనం చేయించింది వేదం?

అమ్మ సృష్టికర్త, అమ్మలేనినాడు సృష్టి జరగదు. సృష్టి జరిగిందీ అంటే అమ్మ ఉన్నది అని గుర్తు. అసలు ఈ సమస్త భువనాలలో సృష్టి జరగడానికి అనువైన శరీర నిర్మాణాన్నీ, అమరికనూ ఈశ్వరుడు ఒక్క స్త్రీ రూపంలోనే ఏర్పాటుచేశాడు. ఆమె లేనినాడు, అటువంటి అవయవాల సంఘాతం లేనినాడు. అసలు ఈ సృష్టి జరగడం కానీ, నిలబడడం కానీ కుదరదు. సృష్టికర్త అయిన బ్రహ్మ అంశ స్త్రీలో ప్రచోదనమై ఉంటుంది. అమ్మ శరీరం గురించి 'భాగవతం'లో 'కపిల గీత' చదివితే అవగతమవుతుంది.


బ్రహ్మ సృష్టి చేసేటప్పుడు తనువు, కరణం, భువనం, భోగం నాలుగింటిని దృష్టిలో పెట్టుకుంటాడని శాస్త్రాలు చెబుతున్నాయి. 'తనువు' అంటే శరీరాన్ని ఏర్పాటుచేస్తాడు. ఆ శరీరం ఏర్పడినప్పుడు మనుష్యుడు బుద్ధితో శాస్త్రాన్ని తెలుసుకుంటాడు. గురువు గారి పాదాలు పట్టుకుని, ఈ జన్మలో మంచి కార్యాలు చేసి చిత్తశుద్ధి పొంది, జ్ఞానానికి యోగ్యత పొందుతాడు. మళ్ళీ జ్ఞానంతో పుట్టాల్సిన అవసరం లేని పునరావృత్తి రహిత శాశ్వత శివసాయుజ్య స్థితిని పొందడానికి కావలసిన ఊర్ధ్వముఖ చలనం చేయగలిగిన మనుష్య ఉపాధిని నిర్మాణం చేయాలంటే - అది అమ్మ కడుపులోనే చేయాలి.

పుట్టినప్పుడు భూమికి అడ్డంగా ఉండాలి వెన్నుపాము, పెరుగుతున్నప్పుడు నిలువుగా పెరగాలి. అలాంటి ప్రాణిని తయారుచేయాలన్నా అమ్మ కడుపులోనే! ఏమీ చేతకాక అసలు కర్మాధికారం లేకుండా, బుద్ధి లేకుండా గత జన్మలలో చేసుకున్న పాపపుణ్యాల్ని అనుభవించడానికే పనికొచ్చే శరీరం తయారుచేయాలన్నా - అమ్మ కడుపులోనే తయారుచేయాలి. అంటే బ్రహ్మ సృష్టికర్తగా శరీరాన్ని ఇవ్వాలనుకున్నా, అది తయారుకావలసింది - అమ్మ గర్భాలయంలోనే! కనుకనే శాస్త్రం అమ్మకు అంతటి ప్రాధాన్యమిచ్చింది.

ఈశ్వరుడు ఈ శరీరాన్ని దయామయుడై అనుగ్రహించాడు. నీ పాపాలు పోగొట్టుకో. మనస్సు, వాక్కు, శరీరంతో పాపం చేశావు. ఇప్పుడూ మూడింటితో పుణ్యం చేసుకో అంటూ శరీరాన్నిచ్చాడు. దీనితో దేవాలయాన్ని కడుగు! తల్లికి, తండ్రికి నమస్కారం పెట్టుకో! గురువుకు ప్రదక్షిణం చేసుకో! పరులకి ఉపకారం చేస్తుండు! మనస్సులో ఉత్తమభావాలను కలిగి ఉండు! ఇతరుల్ని తక్కువగా చూడకు! వారి హితం కోరుకో! మనస్సును సంస్కరించుకో!! అన్నది చాగంటి వారి ప్రవచన సారాంశం!

**(చాగంటి వారికి కృతజ్ఞతలు)**





# శ్రీశ్రీ విద్యాశంకర భారతీతీర్థస్వామి పుష్పగిరి మహాసంస్థాన కరపీఠం 49వ పీఠాధిపతి

**వీరి పాలనాదక్షతలోనే పుష్పగిరి మహాస్థాన శంకరపీఠం వర్ధిల్లుతూన్నది.**

శృంగేరీ పీఠం మహాసంస్థాన శంకరపీఠం సంస్థాపకులు శ్రీశ్రీ విద్యారణ్య స్వామివారు పుష్పగిరి పీఠాన్ని స్థాపించారు. శ్రీ స్వామివారు స్థితప్రజ్ఞులు, మంత్ర వేత్తలు, సకల విద్యాపరిపూర్ణులు. వారు హరిహరరాయలు, బుక్కరాయ లిరువురిచే విజయనగర సంస్థానమును స్థాపింప చేశారు. వారు చెప్పిన సుముహూర్తమునకు విజయనగర సామ్రాజ్య స్థాపనం జరిగి ఉంటే ఈనాటికినీ విజయనగర పాలనలో రాయల వంశీకుల పాలన అస్తమించేది కాదు. హంపీ విజయనగరంలో రాయల వంశీకులు శిల్పకళా వైదుష్యం శిథిల శిల్పాల్లో ద్యోతకమవుతూన్నది. ఒక మండపం లోని స్తంభాలలో సరిగమ సంగీత ధ్వనులు వినిపిస్తాయ్. విరూపాక్షుని ఆలయంలో నేలలో తుంగభద్ర నీరు రావడమూ, వాడిన నీరు పోవడమనేది నేటికీ కలిపిస్తూన్న దంటే ఆనాటి ఇంజనీర్లు ఎంతటి ప్రతాభావంతులనేదీ ద్యోతకమవుతూంది.

వారు స్థాపించిన శంకర మఠాలు మహోజ్వల కీర్తి ప్రతిష్ఠలను సంతరింపచేసు కుంటున్నాయ్. ఆవురు ఆవురుమంటూ నోరు తెరుచుకున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ కనులు పుష్పగిరి మహాసంస్థాన పీఠంపై పడడంతో పీఠం మరుగునపడి పోయింది. వారు స్థాపించిన పుష్పగిరి శంకరపీఠం జాజ్వలమానంగా భాసిల్లింది; భాసిల్లుతూంది. మౌనంగా భాసిల్లింది; భాసిల్లుతూంది. వందలాది ఎకరాల పంట భూములూ, వేలాది లక్షల ఖరీదు ఆస్తులూ అన్యాక్రాంతమయ్యాయ్. దీనిక్కారణం మధ్యలో కొందరు పీఠాధిపతులు అస్తమించారు. ఒకరికి మతిభ్రమణం కల్గడం. పీఠైశ్వర్యాన్ని ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకున్నది. దేవాదాయ ధర్మాధికార శాఖకు హైందవ ఆలయాలపై పెత్తనం ఎలా దత్తమైందో తెలియదు. ఇట్టి పరి స్థితుల్లో, షావుకారు గుమాస్తా రాబడి కూడా రాని సంస్థానానికి చెన్నూరు (కడప జిల్లా) వాస్తవ్యులు సుబ్రహ్మణ్య వంశజ్ఞులు శ్రీశ్రీ విద్యాశంకర నృసింహ భారతి ఆస్థాన నామంతో పీఠాధ్యక్షులై – అన్నివిధాలా పుష్పగిరి పీఠాన్ని ఉన్నత స్థానానికి తీసుకుని వచ్చారు.

హైందవేతరుల ఆలయ ఆస్తులపై అణుమాత్రం అజమాయిషీ చూపని ప్రభుత్వం హైందవ ఆలయాలపై ఎలా పెత్తనం సాగిస్తుందనేది అనూహ్యం. హైదరాబాదు, శ్రీకాళహస్తిలో శాఖా కార్యాలయాల్ని, వసతి గృహాల్ని, మఠాధికారులు స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేశారు. మద్రాసులో అన్యాక్రాంతంగా నున్న పీఠ ఆస్తుల్ని తిరిగి పీఠానికి స్వాధీనమయ్యేట్లు శ్రీశ్రీ విద్యాశంకర నృసింహ భారతీ మహా భారతీ స్వామి అనన్య కృషి చేసారు. స్వామివారు మద్రాసు వస్తే మా యింట్లోనే పీఠంతో సహా ఉండేవారు. వారి సిబ్బంది కూడా మా ఆతిథ్యమునే తీసుకునేవారు. వారి కృషితో పీఠ ఆస్తులన్నీ మఠం స్వాధీనమయ్యాయి. పాలనలోకి వచ్చాయ్. అనర్తరమ్ వారు హైదరాబాద్‌లోని బేగంపేట (ప్రస్తుతం ఉన్నచోట) ఆశ్రమ పాలన విస్తరణం చేశారు.

ఇతఃపూర్వం మా ఇంటినుంచే దక్షిణ భారతదేశంలోని తమిళ జిల్లాల పర్యటనం చేసిన స్వామివారు, బేగంపేట ఆశ్రమ విస్తరణం తరువాత ఆంధ్ర, తెలంగాణా జిల్లాల పర్యటనకు అత్యంత ప్రాధాన్యం యిచ్చారు. పుష్పగిరి పీఠం పూర్వ వైభవ వెల్తూరు చూచినదంటే గత పీఠాధిపతి శ్రీమభినవోద్దండ శ్రీశ్రీ విద్యా నృసింహ భారతీతీర్థ మహాస్వామియే కారణం! ప్రభుత్వ కోరల నుండి పీఠాన్ని స్వయంపాలన లోకి తీసుకుని వచ్చిన ఘనుడాయన. ఆ ఘనతలో కొంతగానీ మా కృషీ ఉన్నదని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ●

**మా తాతగారు మా స్వగ్రామమైన వరిధనంలో ఓ శివాలయ మును నిర్మించారు. ఆ ఆలయానికి కొన్ని ఎకరాల ఆస్తులనిచ్చారు. అర్చకునికి ఆ ఆలయ ప్రాంగణంలోనే స్థలం కేటాయించి అర్చకులకు గృహం నిర్మించి యిచ్చారు. ఆ ఆలయానికిచ్చిన ఆస్తుల రాబడిని వారి అనన్తరం ప్రభుత్వమే తీసుకుంటుది. ఆలయ సాంప్రదాయం ప్రకారం జరుగ వ్రాసిన పాంచరాత్రిక కల్యాణమును ఆలయాధికారం గల ప్రభుత్వాధికారుల దయాధర్మంపై జరుగు తున్నది. నాలుగైదు గ్రామాలయాల అధికారియైన ఆయన ఎప్పుడో వస్తారు. ఆలయ ధూపదీప నైవేద్యాల పట్ల అంతంతమాత్రమే శ్రద్ధ చూపుతారు. ఆలయ భూములపై వచ్చే ఆదాయం వారి ఖాతాలోకే పోతుంది. ఇలా ఎన్ని ఆలయాలపై ప్రభుత్వం వారి పెత్తనం సాగు తుందో అనూహ్యం.**

**ఇతర మతస్థుల ప్రార్థనాలయాలపై ప్రభుత్వం ఇలా పెత్తనం సాగించగలదా? అనునది సమాధానం చిక్కని ప్రశ్నే!**


SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

## ఊరు సహజీవనం తీరు సమభావనం మనోభావంతో మానవీయత! ధ్యేయం లోక కల్యాణం అనుకుంటూ, అడుగు ముందుకు వేసిననాడు విశ్వమానవ సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుంది!

పగ, ద్వేషం పరిసమాప్తమవుతుంది! కాలు సేతులతో మంచి పనులు చేయ కలుగుతాడు! కానిచో కాలు చేతులునన్ననూ మానవుడనిపించుకోడని ఓ పెద్దాయన “కాలు చేతులున్నంత మాత్రమునే కాడు కదా నరుడని కీర్తనం చేసాడు!” అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు అంతరంగముందున్నా ఫలితమేఁవిటియని మరొకాయన వాపోయాడు!

తత్వచింతనయే నిరంతర కాంతిధార! నిరంతర కాంతిధారే క్రాంతిధార.

నిరతమూ ప్రగతి ప్రతిభను వ్యక్తీకరిస్తూంటుంది. సుస్థిర జీవనసౌధ ఆవాసాన్ని కలిగిస్తుంది. మనిషికివేఁవీ తెలియనివీ కావు? ఆచరించలేని కార్యములూ కావు! అలసత్వం ఒకటే అతని అలక్ష్యమునకు కారణమవుతున్నది. అందుకే ఆ పెద్దాయన ‘కాలు సేతులున్నంత మాత్రమునే కాడు కదా నరుడంటూ, నీతి కోసమొక మంచి కార్యం చేయమన్నాడు! నీతిగ నడవడం ఒక్కటే ప్రధానమన్నాడు. జన్మలలోకి నరజన్మ ఉత్తమమైనదని నరుడు యెరగకుండా లేడు. ఆనాడు ఏనుగు లక్ష్మణ కవి ‘సాధు సంగంబు సకలార్ధ సాధనంబు అని ఉద్ఘాటించాడు. ‘మానవత్వ ధ్యేయం లోక కల్యాణము’ అని మాత్రమే గ్రహించమన్నాడు. ఆ అక్షర సమాహారమును పునః పునః స్మరణకు తెచ్చుకుంటూ, ఆ ప్రకారం అక్షరాలా ముందడుగు వేసిననాడు–ఆ అక్షరములే మానవునికి లోక రక్షకములు కాకల్గుతాయి. అక్షరం లోకరక్షకమవుతుంది!

కారణం అక్షరంబు తల్లి అఖిల విద్యలకున్, అక్షరంబు లోకరక్షకంబు కావడమే.

అక్షర సమాహారమైన చదువే ప్రపంచమంతటికినీ ఆశాదీపం. ఆ ఆశాదీప వెల్తురే లేనినాడు లోకమంతటా అజ్ఞాన చీకట్లే వ్యాపిస్తాయి.

బ్రహ్మ సృష్టించిన ఈ సృష్టిలో ఏడు అధోలోకాలు ఉన్నాయ్, ఏడు ఊర్ధ్వలోకాలున్నాయ్. అన్నిటికీ ప్రాధాన్యం వహించిన ఊర్ధ్వలోకాల్లో ప్రాభవం కలిగింది భూలోకం. ఈ భూలోకంమీదనే మానవాది ప్రాణికోటి నివసిస్తూన్నది.

నవవాద బృందగీతానికి స్వరకల్పన యువతర గళాల మీదుగానే సాగాలి. ఉత్సాహ ఉల్లాసాలకు పునాదులిక్కడే ఏర్పడుతున్నాయ్. ప్రపంచ ప్రగతి యువతపైననే ఆధారపడి వున్నదని గ్రహించి, ఆ భారాన్ని వారిపై వేయాలి. ఉగ్రవాదం సమసి, సామ్యరూపం వెల్లివిరుస్తుంది. పురోగమనం ప్రారంభమవుతుంది – అనెడు సత్యాన్ని గ్రహించాలి.

కవులు రచయితలు! కానీ రచయితలందరూ కవులు కారు! ఉన్నదున్నట్లు చెప్పకలిగే ధీర సంపన్నులు! ధీరత్వం గల వీరి రచనల్లో గంభీరత ఉంటుంది!

రాచకొండ విశ్వనాధ శాస్త్రి తెలుగు రచయితల్లో ప్రఖ్యాత రచయిత; కవుల్లో మహాకవి! కథారచయితల్లో ప్రఖ్యాత కథారచయిత.

కథనుగానీ, వ్యాసాన్నిగానీ, ఎలా దొలచి, మలచి, వలచి చెప్పాలో ఆయనకు మంచి అవగాహన ఉన్నది. చదువరులనెలా రంజింపచేయాలన్నదీ ఆయనకు బాగా తెలిసిన విద్య. అవగాహన మున్న మహా రచయిత. ప్రతిభా సామర్ధ్యాలు ఆయన స్వంతం. స్వతంత్ర శక్తీ సమన్వితుడాయన. ప్రతిభా సంపన్నుడు. ఆయన మాటలెలాటి సత్యాలో తెలియచేయడానికి ఆయన భాషలోనే తెలియచేసే ప్రయత్నం ఆయన మాటల్లో తెలియచేస్తున్నాను.

నేను ఎవరికన్నా గొప్పవాణ్ణి కాను. నన్ను మించిన గొప్ప వాళ్ళు నా సహచరుల్లో ఉన్నారన్నారు– అంటూనే వారింటి పెరటిని గొప్పాగా చెప్పారు!

మా యింటి వెనుక పెరటిలో ఉన్న చెరువు మహాసముద్రంలా ఉంటుంది. ఎండలో వెండి రంగుల్లో కదలని కొండలా ఉంటుంది. ఆకాశాన్ని తాకే ముద్దు మేయులా ఉంటుంది.

వేసవిలో తరవాణీ అన్నం కుండలా ఉంటుంది. వెన్నెలలో వేడెక్కిన ప్రియురాలిలా ఉంటుంది. ఒప్పుల కుప్పలా, ఉప్పగా, చక్కగా, చల్లగా, నును వెచ్చగా, మేనును ఆనందంతో పులకరింప చేస్తుంది. కోపం వస్తే భయంకరంగా భీతి కలిగిస్తుంది.

చల్లబడితే తన కెరటాలతో తల్లిలా లాలిస్తుంది. ఇలా ఎన్నో అద్భుతాల అనుభూతిని పొంది నివ్వెనపోయిన నాకు , ఏరాడకొండ అనతి దూరంలో నిటారుగా నీలంగా నిలబడిన అనుభూతి కలిగిస్తుంది. కదిలే రథంలా, నీలాంబరిలా ఉంటుంది. నీలి సముద్రంపైన నడిచే ఓడల్లా, దేశదేశాల ఓడలూ కనిపిస్తాయ్. ఒక్కొక్కప్పుడు గంధర్వ కన్యలు తమ శిరోజములపై తెల్లని మల్లెపువ్వులు తురుముకుంటూ తేలియాడుతున్నట్లుంటుంది. వీటినన్నిటినీ వీక్షిస్తున్నపుడు, వినువీధుల్లో ఆనందం చేస్తున్నారనే ఆనందానుభూతి కలుగుతుందన్నారాయన. ●

### తాతయ్యా! నువ్వు నాటిన మొక్క వృక్షమైంది!

తాతయ్యా ఇంటి పెరట్లో
నువ్వు నాటిన మొక్కే చెట్టయింది.
నీ పిల్లల పిల్లలు! ఆ చెట్టు కొమ్మల మీదెక్కి ఆడుకుంటున్నారు.
కొందర్లోనే ఆ చెట్టును
ఆ చెట్టుకు కారణమైన నిన్ను
మరచిపోతారు
ఆ చెట్టుమీద వారి గెంతులు అడుగులు -
నీ గుండె మీద బరువుగా దిగుతున్నాయేమో
పూర్తిగా వారు పైకెక్కినప్పుడు
నీ చేతులతో పైకెగరేసినట్లుంటుందేమో
అవును నిజం తాతయ్యా’

(2017 ఆగస్టు ‘కవిత’లో ముకుంద రామారావు రచనకు కృతజ్ఞతలు)

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
“అజంతా”
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై



# ఏ దేశం వెళ్ళినా, ఎందుకాలిడినా, నీ దేశమునూ, నీ భాషనూ మరువరాదన్న మహామనిషి రాయప్రోలు సుబ్బారావు!

ఏ దేశమైనా వెళ్ళు! ఏ ఖండములోనైనా వసియించు, కానీ, 'నీ దేశమునూ, నీ భాషనూ మరువరాదు సుమా!' అన్నారు రాయప్రోలు సుబ్బారావుగారు. తెలుగువారు ఏయే దేశాలో వెదుతుూంటారు. కాకులు మసలని ప్రదేశాలకు వెదుతుూంటారు. నేను తరచు వెద్తూన్న అమెరికా ఖండంలో కాకులు లేవు సుమండీ! అలా అని కారదవులు కావుగానీ హరితవనీ లెక్కువగా ఉన్నాయ్! ఆయన దీర్ఘదర్శనం చేస్తూ, ఆ మాటనన్నారన్నది అక్కడ నూటికీ నూరుపాళ్ళ సత్యమనిపించింది.

కొలంబస్‌కు ముందే విదేశాలను దర్శించిన తెలుగువారున్నారు. మార్గనిర్దేశ నం చేసుకోకుండా గాలి తెరల ఓడల్లో సాగరాలను అధిగమించి ఖండఖండాలను దర్శించిన వారున్నారు; ఖండ ఖండాలలోనూ స్థిరపడినవారున్నారు. వారి వారి భాషలను మార్చుకోకుండా కొందరుంటే వారి వారి వేషభాషలను మార్చుకుని ఆయా జాతులలో కలిసిపోయిన వారు మరికొందరున్నారు. అయినా వారి రక్తమాంస కందరాల్లోని భారతీయత చెక్కుచెదరలేదు.

ప్రస్తుతం (జూన్30) నేనున్నది అమెరికా న్యూజెర్సీలోని ఎడిసన్ పట్టణం. మా అబ్బాయి నాగసాయిప్రసాద్ అక్కడ ఉంటున్న కారణంగా రెండు సంవత్సరాల కొక పర్యాయం వాళ్ళతో మూడునెలలు కాలక్షేపం చేసి వెదుతుూంటాను. మా అబ్బాయి గృహపరిసరాల్లో చెన్నయ్ నుంచి వచ్చిన వారే స్థిర నివాసాలేర్పరచు కుని ఉండడం వలన నాకు విదేశంలో ఉన్న అనుభూతి; వార్తావరణం మార్పు కనిపించదు. చెన్నయ్‌లో ఉంటున్నట్లుగానే ఉంటుంది.

నా జీవన నగరం నేను రెండు దశాబ్దములుగా భారతదేశంలోని చెన్నయ్ మహానగరం. పెరిగి విద్యాబుద్ధులు వడసినది పాలకొల్లు మహాపట్టణం. పాలకొల్లు నుంచీ వచ్చిన తరువాత పండుగలకూ, పర్వాలకూ పాలకొల్లు వెళ్ళి వస్తూండే వాడిని. వివాహమై, చెన్నయ్‌లో గృహం నిర్మించుకున్న తరువాత అలా వెళ్ళడం తగ్గింది, పిల్లలు పుట్టి పెరిగిన తరువాత వారు చెన్నయ్‌కు అలవాటుపడి పాల కొల్లు వెళ్ళడం లేదు. నేను కూడా మా అన్నయ్యగారి కుటుంబం ఉంటున్నందువల్ల అరుదుగా వెళ్ళి వస్తుంటాను. వెళ్ళినపుడు వరిధనంలో మా తాతగారు కట్టిన శివాలయం దర్శించి వస్తూంటాను. వరిధనం మా పూర్వుల స్వగ్రామం. ఆ గ్రామం మీద నాకున్న మమత సన్నగిల్లడం లేదు. ఎప్పటికీ సన్నగిల్లదు. శక్తి ఉన్నంతవరకూ వెళ్ళి వస్తూనే ఉంటాను. అయితే అక్కడ క్రైస్తవ మత ప్రచారులెక్కు వయ్యారు. వారి పేదతనాన్ని ఆసరాచేసుకుని మతప్రచారం చేస్తున్నారు.

ఒక్కొక్కప్పుడు అనిపిస్తూంటుంది. నేను పుట్టినది తూర్పుగోదావరీజిల్లా రాజోలు సమీపంలోని కస్తూరివారి బి.సావరం గ్రామం. అది మా మాతామహుల గ్రామం. ఇప్పుడు ఆ ఊరిలో మా మాతామహుల ఇల్లులేదు, మాతామహుల కుటుంబీకులెవరూ ఉండడం లేదు. కాలం తెచ్చిన మార్పులో వంశీకులందరూ నగరాలకు వలసిపోయి, అక్కడ స్థిరపడిపోయి ఉండడమే కారణం. కొందరు విదేశాలకు వెళ్ళిపోయారు. ఆ కారణంగా కొన్ని గ్రామాలు చిన్నవయిన్న కుగ్రామాలుగా మారిపోయాయి.

మా వరిధనం గ్రామంలో మా గోటేటి వారి కుటుంబాలవారెవరూ లేరు. మా తాతగారు కట్టించిన శివాలయం, భూములు దేవాదాయ ధర్మాదాయశాఖ అధీనంలోకి వెళ్ళిపోయింది. ఎప్పుడైతే ఆ శాఖ కళ్ళు పడతాయో, అప్పుడా వంశీకులకున్న ప్రమేయం తగ్గిపోతుంది. మనవలుగా ఉన్న ఈ కాలంలోనే ఇలా జరిగిందంటే– ఇకముందు కుటుంబీకులకు అస్సలు సంబంధం ఉండదు.

ప్రస్తుతం నేనున్నది అమెరికా. నా జీవగడ్డ భారతదేశంలోని చెన్నయ్ మహానగరం. నా స్వగ్రామం ఆంధ్రదేశంలోని పాలకొల్లు సమీపపు వరిధనం. నేను పుట్టినది తూర్పుగోదావరి జిల్లా రాజోలు పరిసరాల్లోని కస్తూరివారి సావరం గ్రామం, ఎక్కడ పుట్టాను? ఎక్కడ పెరిగాను? ఎక్కడ విద్యాబుద్ధులు వడసాను? చివరకు చెన్నయ్ మహానగరం నివాస యోగ్యమైంది.

పాలకొల్లులో విద్యాబుద్ధులు వడిసినా, చెన్నయ్ నగరమే నా వాసయోగ మైంది. చెన్నయ్‌లోనే నా పిల్లలు విద్యాబుద్ధులను అలవరచుకున్నారు. పెద్ద కుమారుడు చెన్నయ్‌లోనే ఉంటున్నాడు. స్వగృహం కూడా చెన్నయ్‌లోనే ఏర్పడింది. రెండవ కుమారుడు నారాయణరావు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం కారణంగా పలు ప్రదేశాలు తిరుగుతున్నాడు. మూడవకుమారుడు నాగసాయి ప్రసాద్ ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళి అక్కడ న్యూజెర్సీ అమెరికా పౌరసత్వం పొందాడు. ఇలా ఎందరో తెలుగువాళ్ళు అమెరికా జీవనం చేస్తూ ఆ దేశాభివృద్ధికి కృషిచేస్తున్నారు. ఎవరు ఎక్కడ ఉండాలనేది ఏడుకొండలవాడు రాసి ఉంటాడు. ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిననే మాటనే మరువరాదు. ●

*Compliments from*
**Sri Krishna Bhat**
*When you come to*
*Holy Pilgrimage Centre Tirupati & Tirumala*
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# జీవితంలో హాస్యం

**1977**లో మా అక్కయ్య (దొడ్డమ్మ కూతురు) పెళ్లి బెజవాడలో జరిగింది. అప్పటికి మా దొడ్డమ్మ వాళ్ళు మొగల్రాజపురం నుంచి సూర్యారావు పేటకి మారారు. వాళ్ళ ఇంటికి దగ్గరలోనే గంగరాజు కళ్యాణ మంటపంలో మా అక్కయ్యకి వివాహం అయింది. ( ఆ తర్వాత దాదాపు మళ్ళీ పదహేను ఏళ్ళకి అదే కళ్యాణ మంటపంలో నా బాల్య మిత్రుడు గరిమెళ్ల విశ్వేశ్వరరావు పెళ్లికి వెళ్ళాను). సాయంత్రం ముహూర్తం అవటాన, రాత్రి సెకండ్ షో కి కనకదుర్గ టాకీస్‌లో "సువర్ణ సుందరి" ఆడుతూ వుంటే వెళ్ళాము. ఒకవైపు సినిమా ఎంతకీ అవకపోవటం, మరోవైపు నేను పెళ్లి హడావుడిలో అలిసిపోయి వుండటం వల్ల సినిమా మధ్యలో నిద్రపోయాను. నిద్ర లేచి సినిమా మళ్ళీ చూస్తుండగా హీరో నాగేశ్వరరావు ఎంతకీ కనిపించకపోవడంతో "నాగేశ్వర రావు ఏడి" అన్న నా మాట విని మా చిన్నక్కయ్య "ఆ రాయే నాగేశ్వర రావురా" అంది ( సినిమాలో శాపం వల్ల నాగేశ్వరరావు శిలగా మారతాడు) హాల్‌లోని జనాలు ఘొల్లుమని నవ్వారు.

దైనందిన జీవితంలో కొన్నిసార్లు కంగారులో చేసే పొరపాట్లు హాస్యంగా వుంటాయి. బెజవాడ లీలా మహల్‌లో చాలానే ఇంగ్లీష్ సినిమాలు చూసాను. లీలా మహల్ దగ్గర పుష్పాల రంగయ్య షోడా దుకాణం వుండేది. ఆ దుకాణం పన్నీర్ షోడాకి అప్పట్లో పెట్టింది పేరు. ఆ రోజుల్లోనే పావలాకి అమ్మేవారు. ఎప్పుడు లీలా మహల్ కి వెళ్ళినా అక్కడ పన్నీర్ షోడా తప్పకుండా తాగే వాళ్లము. ఒకసారి బెజవాడ వెళ్ళినప్పుడు సాయంత్రం మద్రాసుకి ట్రైన్ వుంది అనగా మా చిన్నన్నయ్య బలవంతంగా లీలామహల్‌లో ఇంగ్లీష్ సినిమా "గ్రేట్ ఎస్కేప్"కి లాక్కెల్లాడు. సినిమా అయ్యి పరుగు పరుగున రైల్వే స్టేషన్ కి వెళ్లి ట్రైన్ ఎక్కి నా (రిజర్వేషన్) సీట్‌లో కూర్చున్నాక మా చిన్నయ్య చెమటలు కక్కుకుంటూ నాకు వీడ్కోలు ఇచ్చాడు. రెండు నిమిషాలు అయ్యిందో లేదో "ఇక్కడ రవి అన్న పేరు గల వారు ఎవరండీ" అంటూ ఒక పెద్ద మనిషి పెద్దగా అరుచుకుంటూ వచ్చాడు. "నేనే అండీ అన్నాను". నన్ను ఇంట్లో అందరూ రవీ అనే పిలిచేవారు). మీ అన్నయ్య సుబ్రహ్మణ్యం అంట మీకు ఈ టికెట్ ఇవ్వమన్నారు అని బెజవాడ నుంచి మద్రాసుకి వెళ్ళే టికెట్ నా చేతిలో పెట్టాడు. నా జేబులో వున్న టికెట్ తీసి చూద్దును కదా అది బెజవాడ రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం టికెట్ ! అప్పుడు నాకు అర్థం అయ్యింది కంగారులో మా చిన్నన్నయ్య నాకు మద్రాసు టికెట్ కి బదులుగా ప్లాట్ఫారం టికెట్ ఇచ్చి తనదగ్గర నా మద్రాసు టికెట్ పొరపాటున అట్టే పెట్టుకున్నాడని. నేను కూడా ట్రైన్ ఎక్కే కంగారులో నా దగ్గర వున్న టికెట్‌ని సరిగ్గా చూసుకోలేదు. నన్ను ట్రైన్ ఎక్కించాక వెంటనే తన జేబులో చెక్ చేసుకోవడం వల్ల పొరపాటు గ్రహించి అప్పటికే ట్రైన్ బయలుదేరడం వల్ల నా బోగీ లోనే కిటికీ దగ్గర కూర్చున్న ఈ పెద్ద మనిషికి నా టికెట్ ఇచ్చి నాకు అంద చేయమని చెప్పాడని తెలిసింది.


తెలియని విషయాలు మనకి తెలుసు అనుకుని ప్రవర్తించడం వల్ల కొన్ని సార్లు మనం నవ్వుల పాలవుతాం. మద్రాసులో పుట్టి పెరగటం వలన నాకు చిన్నప్పుడు హిందీ వచ్చేది కాదు. 1978 లో తొలిసారి హైదరాబాద్ వెళ్ళాం. నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి మెహదీపట్నం వెళ్ళే బస్సు ఎక్కాం. కండక్టర్ మమ్మల్ని చూసి "అందర్ జావో" అన్నాడు. నేను అతి తెలివి ఉపయోగించి జావో అంటే వెళ్ళు కాబట్టి అందర్ జావో అంటే మమ్మల్నందరినీ లోపలికి వెళ్ళమన్నాడని అనుకుని మా వాళ్ళనందరినీ లోపలికి వెళ్ళమన్నాను. "లోపల ఒక సీటు ఖాళీ గావుంది అని నేను నిన్ను లోపలి వెళ్ళమన్నాను. మీ వాళ్ళ నందరినీ కాదు." అన్నాడు కండక్టర్ తెలుగులో నాకు హిందీ రాదనీ గ్రహించి. అప్పుడు తెలిసింది నాకు హిందీలో అందర్ అంటే అందరూ కాదు లోపలికి అని.

కొన్ని సందర్భాలలో మనం హాస్యంగా మాట్లాడుతున్నాం అని మనం అనుకున్నా అది ఇతరులకి నొప్పించే పరిస్థితి కలిగించవచ్చు. బాపు రమణలు కృష్ణ హీరోగా "కృష్ణావతారం" అనే సినిమా తీసారు. మాకు యువరంజని అనే సాంస్కృతిక సంస్థ అప్పట్లో మద్రాసులో వుండేది. దాంట్లో తెలుగు సినిమాలు ప్రీవ్యూ (సినిమా విడుదలకి ముందు షో) వేసేవాళ్లం. కృష్ణావతారం సినిమా చూసాక బయటికి వస్తూ నేను నా మిత్రుడు శ్రీపతిరావు తో (ఈయన దురదృష్టవశాత్తు పిన్న వయస్సులోనే మరణించాడు) "బాప్ రే ఈ సినిమా బాపూ, రే ( సత్యజిత్ రే) కలిసి తీసినట్టు వుంది." అన్నాను. మా పక్కనే ఒక పెద్ద మనిషి వెడుతూ నా మాటలు విన్నారు. ఆయన పేరు తెలియక పోయినా నాకు వారి ముఖ పరిచయం బాగానే వుంది. ఆయన ఆడిటర్ అయిన మా పెద్ద నాన్న గారి దగ్గరకి వాళ్ళ లెక్కలు చూపించుకోవటానికి తరచూ వచ్చేవారు. ఆయన చివాలున నాకేసి తలెత్తి చూడటం నేను పై వాక్యాలు అంటూ వారికేసి చూసి నవ్వటం వెనువెంటనే జరిగి పోయాయి. నా మిత్రుడు శ్రీపతి రావు నన్ను జబ్బ పట్టుకుని బరబర లాక్కుంటూ వెళ్లి కొంచం దూరం వెళ్ళాక "ఆయన ఎవరనుకుంటున్నావు? ముళ్ళపూడి వెంకట రమణ గారు" అన్నాడు. అప్పటికే ఆయన నా కామెంట్స్ విని మౌనంగా తల వంచుకుని వెళ్ళిపోయారు.

అప్పుడప్పుడు మన నమ్మకాలు, మన ప్రవర్తన హాస్య సన్నివేశాలకి దారి తీస్తాయి. దాదాపు రెండున్నర దశాబ్దాలు మద్రాసు లో వున్నప్పటికీ మా అమ్మమ్మ కి అరవం అస్సలు వచ్చేది కాదు. పైగా ఆవిడె అరవ భాష నేర్చుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు. కానీ చిత్రం ఏమిటి అంటే ఆవిడె అందరితో తెలుగులోనే మాట్లాడేది. పాత మాంబళం (వెస్ట్ మాంబళం) లో బజారులో దుకాణాలకి వెళ్లి కూరగాయలు, సరుకులు కొనుక్కుని వచ్చేది. మా అమ్మమ్మతో బజారుకి వెళ్ళినప్పుడు నాకు చాలా గమ్మత్తుగా అనిపించేది. ఈవిడేమో అచ్చ తెలుగులో (గోదావరి యాస) బేరాలు పెట్టేది. దుకాణదారులు తమిళంలో మాట్లాడేవారు. మొత్తానికి అంతా సవ్యంగా జరిగేది. ఈ సన్నివేశం చూస్తున్నప్పుడు నాకు వింతగా అనిపించేది. నేను అరవంలో తర్జుమా చేస్తానంటే ఆవిడె "నీకేమి తెలియదు. నువ్వు ఊరుకో" అని వారించేది. నేను మనసులోనే నవ్వుకునే వాడిని. "తెలుగు భాష వచ్చినా వీళ్ళు అరవం లోనే మాట్లాడతారు. వీళ్ళకి భాష రాక కాదు..." అని సాగతీసేది మా అమ్మమ్మ. మా అమ్మమ్మకి అరవం అయితే ఒక్క ముక్క కూడా రాలేదు. కాని ఆవిడె తో తరచూ మాట్లాడి చివరికి చాలా మంది మా ఇంటి చుట్టూ పక్కల వుండే షాప్ వాళ్లకి తెలుగు మాట్లాడటం మాత్రం వచ్చింది.

ఒక్కొక్కప్పుడు మన తొందరపాటుతనం మనకి నవ్వు తెప్పిస్తుంది. నేను 1981లో డిగ్రీ పాస్ అయిన వెంటనే మద్రాసు టీ నగర్ లోని కేసరి ఉన్నత పాఠశాలలో ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకి పార్ట్ టైం టీచర్ గా చేరాను. మొదటి రోజు స్కూల్ కి వెళ్లి ప్రధాన ఉపాధ్యాయురాలు ని కలిసాను. ఆమె నన్ను చూసిన వెంటనే, "నువ్వు యూనిఫారం లేకుండా స్కూల్ కి ఎందుకు వచ్చావు?" అని మందలించింది. నేను కాస్త ఖంగారుపడ్డాను ఈ స్కూల్ లో ఉపాధ్యాయులకి కూడా యూనిఫారం ఉంటుందా అని. ఇంతలో ఆఫీసు గుమాస్తా వడివడిగా వచ్చి "మేడం. ఈయన కొత్తగా ఇవాళ జాయిన్ అవుతున్న ఉపాధ్యాయుడు" అని సర్ది చెప్పాడు.

చాలాసార్లు జీవితంలో మనుషుల మధ్య కమ్యూనికేషన్ గాప్ హాస్యానికి దారి తీస్తుంది. జూన్ 1990 లో నా వివాహం నిశ్చయం చేసారు మా పెద్దలు. సెప్టెంబర్ ఇరవైన నా వివాహం ముహూర్తం. ఆగష్టు నెలలో ఒక సారి వేరే పని మీద హైదరాబాద్ వెళ్లటం జరిగింది. అమ్మాయి వాళ్ళది హైదరాబాద్. తిరుగు ప్రయాణం నాడు నాంపల్లి రైల్వే స్టేషన్‌లో నా కాబోయే శ్రీమతిని కలుద్దామని నేను అనుకున్నాం. నేను నిర్ణీత సమయం కన్నా గంట ముందుగానే వెళ్లి స్టేషన్ లోపల నిరీక్షించ సాగాను. ట్రైన్ కూడా వచ్చేసింది కానీ నా కాబోయే శ్రీమతి రాలేదు. ఆరోజుల్లో ఇప్పట్లో లాగా సెల్ ఫోన్స్ లేవు. ట్రైన్ బయలుదేరే సమయం అయింది. ఇంక ఆమె రాదనీ నిర్ధారించుకుని నిరాశగా ట్రైన్ ఎక్కాను. ట్రైన్ బయలుదేరు తుందనగా నా కాబోయే శ్రీమతి, ఆమె అన్న వడివడిగా (దాదాపు పరిగెట్టుకుంటూ) వస్తూ కనిపించారు. అప్పటికే ట్రైన్ వేగం పుంజుకుంది. కొన్ని రోజుల తరవాత నాకు తెలిసింది ఏమిటి అంటే వాళ్ళిద్దరూ రెండు గంటలుగా నాంపల్లి రైల్వే స్టేషన్ బయట నాకోసం ఎదురు చూస్తూ **(తరువాయి 16వ పేజీలో)**



# వెన్నలా కంటిని! నీవచట కుశలమా? వెన్నెలకంటి వెన్నెలకన్నా చల్లని పాట వ్రాసారు.



గుణ చిత్రంలోని ఈ పాటకు నాకు మంచి పేరు వచ్చింది. తమిళం నుంచి తెలుగులోకి బాలుగారు హక్కులు తీసుకున్నారు. అప్పటికే డబ్బింగ్ చిత్రాలకు రాజశ్రీగారు రాసి ఉన్నారు. నాతో పాటలు రాయించాలని నిశ్చయించారు బాలు. అనువాదం రాసేటప్పుడు వారి పెదవుల కదలికకు అనుగుణంగా భావం చెడకుండా పాట రాయాలి. ఒరిజనల్ పాటకు తెలుగు అనువాదం గురించి రాజశ్రీగారిని అడిగాను. ఆయన కొన్ని పదాలు అందిస్తూ పాట రాయమన్నారు. నేను కేవలం అనువాదం మాత్రమే తెలుసుకుని, నా ఆలోచనలకు అనుగుణంగా గంటలో పాట పూర్తిచేసి రాజశ్రీగారికి చూపించాను. రాజశ్రీగారువి ఆప్యాయంగా ముద్దుపెట్టుకుని నన్ను అభినందించారు.

ఈ సినిమాలో కథానాయకుడు ప్రేమ పిచ్చివాడు, కథానాయిక పార్వతీదేవిలా కనిపిస్తుంది. ఆ అమ్మాయిని కిడ్నాప్ చేస్తాడు. ఆ అమ్మాయికి ఉత్తరం రాయాలనుకుంటాడు. తనకు చదువు రాదు కనుక, తాను చెబుతుంటూ ఆ అమ్మాయినే ఉత్తరం రాసి ఆ తరువాత చదువుకోమంటాడు. తన హృదయంతో ప్రేమలేఖ రాస్తాడు. 'కమ్మని ఈ ప్రేమలేఖనే రాసింది హృదయమే' అంటూ ప్రారంభించాను. ఏ ఉత్తరంలో ముందుగా రాసేది ఉభయకుశలోపరి. 'ప్రియతమా నీవచట కుశలమా నేనిచట కుశలమే' అని పలకరించాక, ఆ మాటల్లో కవిత్వం ఉంటే అందరూ ఆహా ఓహో అంటారు. అందుకే మూడునాలుగు వాక్యాలలో 'ఊహలన్నీ పాటలే కలల తోటలో... తొలి కలల కవితలే మాట మాటలో' అంటూ కొద్దిగా కవిత్వం రాశాను.

చరణాలలోకి వచ్చేసరికి కథానాయిక సౌకుమార్యాన్ని, కథానాయకుడి మొరటుతనాన్ని చేపేలా సాగింది రచన. 'వెలికి రాని వెర్రి ప్రేమ... కన్నీటి ధారలోన కరుగుతున్నది...' అంటూ కథానాయకుడు మనోగతాన్ని ఆవిష్కరించాను ఈ వాక్యంలో. అతడికి తన ప్రేమను వ్యక్తం చేయడం చేతకాదు. అది చెప్పలేక అతడి కళ్లనుంచి కన్నీటి ధారలు కురుస్తాయి. ఆ ధారలో ఈ ప్రేమ కరిగిపోతుంది అనే భావం ఇక్కడ వ్యక్తం చేశాను. అతడి దృష్టిలో ఆమె ఎంతో పవిత్రమైనది. అందుకే 'అగ్ని కంటె స్వచ్ఛమైనది' అంటాడు. సాధారణంగా వస్తు స్వచ్ఛతను అగ్నిలో వేసి నిర్ధారిస్తాం. ఆ అగ్ని కంటే కూడా తన ప్రియురాలు స్వచ్ఛమైనది అంటాడు.

అతడు ఆమెను పార్వతీదేవిలా భావిస్తాడు. వారి మధ్య ఉన్న ప్రేమ సామాన్య మానవులకు అర్థం కాదు అంటాడు. 'ఉమాదేవిగా శివుని అర్థభాగమై... నాలోన నిలువుమా' అనే అద్వైతతత్వాన్ని చెబుతాడు కథానాయకుడు. తమిళ పాటకి, తెలుగు పాటకి ఏ మాత్రం పోలిక లేకుండా జాగ్రత్తపడ్డాను. మూడు నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఈ పాట మీద వ్యాసాలు వస్తూనే ఉన్నాయి. నాకు నచ్చిన నా పాటల్లో ఈ పాట ఒకటి. నాతోపాటు ప్రేక్షకులకు కూడా నచ్చింది. కుంచె రఘు ఈ పాటను వీడియో ఆల్బమ్ చేశాడు.

కృతజ్ఞతలు **వైజయంతి**

---

(15వ పేజీ తరువాయి) నిలబడ్డారని. నేను వాళ్ళ కోసం స్టేషన్ లోపల ఎదురు చూస్తున్నాను !

భాషా, మాండలీకాలు కూడా కొన్నిసార్లు నవ్వు పుట్టించే సంఘటనలు కల్పిస్తాయి. నా దగ్గర మనోహర్ అనే పేరు గల డ్రైవర్ ఉండేవాడు. నెల్లూరు కుర్రాడు. నాదగ్గరకి వచ్చేసరికి అతనికి ఇరవై ఏళ్లు ఉంటాయి. ఒక దశాబ్దం పాటు నాదగ్గర ఉన్నాడు. ఇంట్లో మనిషిలా మసలేవాడు. ఒకసారి పండగ రోజున సరిగ్గా సమయానికి తమలపాకులలోకి వక్కపొడి లేకపోవటంతో మనోహర్‌ని పిలిచి, "చెక్క పొడి తీసుకురా" అని పంపించేను (మా నాన్నగారు వాళ్ళది తూరుపు ఆంధ్ర. ఆ ప్రాంతంలో వక్కపొడిని చెక్కపొడి అనటం అలవాటు). ఒక అరగంట తరవాత ఉత్త చేతులతో తిరిగివచ్చాడు మా మనోహర్. అదేమిటని అడిగితే "ఇవాళ పండగ కదండీ ! ప్లయ్ వుడ్, ఫర్నిచర్ షాపులు అన్నీ మూసివున్నాయి" అన్నాడు. అప్పుడు నాబుర్రలో వెలిగింది చెక్క పొడి అంటే మా మనోహర్ వుడ్ పౌడర్ అనుకున్నాడని!

నా దృష్టిలో– నవ్వు కొన్ని సందర్భాలలో అపహాసానికి దారి తీయవచ్చును కానీ హాస్యం ఎల్లప్పుడూ అందరినీ మనస్ఫూర్తిగా నవ్విస్తుంది. అందుకేనేమో నవ్వు నాలుగు విధాల చేటు అన్నారు. సహజంగా, అప్రయత్నంగా జీవితంలో కొన్ని సంఘటనల వల్ల, సన్నివేశాల వల్ల, మనుష్యుల ప్రవర్తనల వల్ల లేదా ఈ అన్నిటి కలయిక వల్ల ఉద్భవించే హాస్యం అందరినీ అన్నివేళలా సున్నితంగా అలరిస్తుంది. అందుకే మన తెలుగు సాహిత్యం లో కన్యాశుల్కం, బారిస్టర్ పార్వతీశం, గణపతి, అత్తగారి కథలు వంటి రచనలు, భమిడిపాటి కామేశ్వర రావు, ముళ్ళపూడి వేంకట రమణ లాంటి రచయితలు, జంధ్యాల వంటి సినీ రచయిత, దర్శకుల పేర్లు ఇప్పటికీ హాస్యానికి ప్రతీకలుగా చెప్పుకుంటాం. "Literature is the criticism of life" (జీవితాన్ని విశ్లేషిస్తే అది సాహిత్యం అవుతుంది) అన్నాడు Mathew Arnold. నవరసాలు మేళవించిన జీవతంలో హాస్యం కూడా ఒక భాగం. అది సహజంగా వున్నప్పుడే నవ్వుతో పాటు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. **– బి.ఎన్.వి. పార్థసారథి,**

16.6.2018.





# కాళిదాసు గర్వభంగం

ఈ లోకంలో అలా అలసిపోకుండా సంచరించే బాటసారులు ఇద్దరే ఉన్నారు. వారే సూర్యచంద్రులు

ఈ సృష్టిలో ఇద్దరే అతిథులు. ఒకటి ధనం, రెండోది యవ్వనం. ఈ రెండూ ఎప్పుడు వెళ్లిపోతాయో ఎవరికీ తెలియదు

మండు వేసవిలో ఒకరోజు మహాకవి కాళిదాసు పరదేశానికి బయల్దేరాడు. మిట్టమధ్యాహ్న సమయానికి ఒక కుగ్రామానికి చేరుకున్నాడు. బాగా దాహం వేయడంతో ఓ గుడిసె దగ్గరికి నీళ్ల కోసం వెళ్తాడు. ఓ బాలిక నీటి కుండతో గుడిసెలోకి వెళ్తుంటుంది. ఆమెను చూసి 'బాలికా! నాకు దాహంగా ఉంది. నీళ్లు ఇవ్వమ'ని అడిగాడు కాళిదాసు. అప్పుడా బాలిక.. 'మీరెవరో నాకు తెలియదు.. నీళ్లు ఎలా ఇచ్చేద'ని బదులిచ్చింది. కాళిదాసు 'నేను ఎవరో తెలియకపోవడం ఏంటి? పెద్ద పండితుడను. ఎవరిని అడిగినా చెబుతార'ని అన్నాడు. అహంకార పూరితమైన ఆ మాటలు విని బాలిక నవ్వి.. 'మీరు అసత్యమాడుతున్నారు. ప్రపంచంలో ఇద్దరే బలవంతులు ఉన్నారు. వారెవరో చెబితే నీళ్లు ఇస్తాను' అంటుంది.

అప్పుడు కాళిదాసు కాసేపు ఆలోచించి.. 'నాకు తెలియదు. గొంతు ఎండిపోతోంది. ముందు నీళ్లు ఇవ్వమ'ని బతిమాలుకుంటాడు. అయినా ఆ బాలిక కనికరించదు. 'ఇద్దరు బలవంతులు ఎవరో కాదు ఆకలి, దాహం. ఇప్పుడు చెప్పండి మీరు ఎవరు?' అని అడుగుతుంది బాలిక. 'నేను బాటసారి'ని అన్నాడు కాళిదాసు. 'మళ్లీ అసత్యమాడుతున్నారు. బాటసారి అంటే ఒకచోటి నుంచి మరోచోటికి బడలిక లేకుండా వెళ్లాలి. మీరేమో అలిసిపోయారు కదా. ఈ లోకంలో అలా అలసిపోకుండా సంచరించే బాటసారులు ఇద్దరే ఉన్నారు. వారే సూర్యచంద్రులు!' అని చెప్పి గుడిసెలోకి వెళ్లింది బాలిక.

దాహానికి తట్టుకోలేక.. ఆ గుడిసె ముందే నిలబడి.. 'మాతా నీళ్లు ఇవ్వండి. దాహంతో చనిపోయేలా ఉన్నాను..' అని ప్రాధేయపడ్డాడు కాళిదాసు. లోపలి నుంచి ఓ ముసలావిడ బయటకు వచ్చి.. 'మీరెవరో సెలవివ్వండి.. నీళ్లిస్తాను' అంది. కాళిదాసు దీనంగా.. 'నేను అతిథిని..!' అని బదులిచ్చాడు. 'మీరు అసత్యం చెబుతున్నారు. ఈ సృష్టిలో ఇద్దరే అతిథులు. ఒకటి ధనం, రెండోది యవ్వనం. ఈ రెండూ ఎప్పుడు వెళ్లిపోతాయో ఎవరికీ తెలియదు' అంటుంది. కాళిదాసు.. 'నేను సహనశీలిని నీళ్లు ఇవ్వండ'ని వేడుకుంటాడు. కానీ ఆమె 'మీరు మళ్లీ అసత్యమే చెబుతున్నారు. ఈ ప్రపంచంలో ఇద్దరే సహనశీలురు ఉన్నారు. ఒకటి భూమి, రెండోది వృక్షం. ఇప్పుడు నిజం చెప్పు నీవెవరు?' అని అడిగింది.

ఓపిక నశించిన కాళిదాసు.. 'నేను మూర్ఖుడను. ఇప్పుడైనా నీళ్లివ్వండ'ని అడిగాడు. ఆ అవ్వ నవ్వుతూ.. 'ఇదీ అసత్యమే. ఈ రాజ్యంలో ఇద్దరే మూర్ఖులున్నారు. ఒకరు ఈ రాజ్యాన్ని పాలించే రాజు. అర్హత లేకున్నా ప్రజలపై పెత్తనం చెలాయిస్తున్నాడు. రెండోవాడు ఆ రాజు మెప్పు కోసం అసత్య వాక్యాలు చెప్పే పండితుడు' అని అంటుంది. ఆ జవాబుతో కాళిదాసుకు కనువిప్పు కలుగుతుంది. ఆ అవ్వ కాళ్ల మీద పడి క్షమాపణలు కోరుతాడు. ఆ అవ్వ సరస్వతీదేవిగా సాక్షాత్కరించింది. 'కాళిదాసా..! విద్యతో వినయం వృద్ధి చెందాలి కానీ, అహంకారం కాదు నాయనా! కీర్తిప్రతిష్ఠల మాయలో పడిపోయిన నీ బుద్ధిని మరల్చడానికే ఈ పరీక్ష' అని జలమును అనుగ్రహిస్తుంది. ●

# తొలినాటి నటీమణులు అసమాన ప్రతిభాశీలురు! అందు 'రామతిలకం' మేటి!!

అందమునకు కన్నాంబ, రాగానికి రామతిలకం, యాక్షన్‌కి గగ్గయ్య ఎందరో ఉన్నారే – నెరానెరా నెరబండి, నెరవోరి దండో నెరనెరా నెరబండి – అని నా చిన్ననాటి వారెందరో పాడేవారు. పెద్ద సుతిలో ఎలుగెత్తి పాడడంలో 'రామతిలకం'కు సాటి ఎవ్వరూ లేరనేవారు. మైలవరం నాటకం కంపెనీలో ఎంతో ప్రసిద్ధి పొందిన నటీమణి. అంత అందంగా ఉండే మహిళ కాదుకానీ, పద్యం చదవడంలో, పాట పాడడంలో, వచనం చెప్పడంలో, ముఖంలో భావం పండించడంలో ఆమెను మించిన వారు లేరని చెప్పేవారు. వీటిముందు ఆమె అందం 'బలాదూర్'గా ఉండేది. గాన సామ్రాట్ కపిలవాయి రామనాథశాస్త్రి గారితో ఎక్కువ నాటకాల్లో పోటీపడి నటించిన నటీమణి ఎవరయ్యా అంటే రామతిలకమే! ఆ రోజుల్లో స్టార్ హంటరని పిలువబడే ప్రసిద్ధ దర్శకుడు సి. పుల్లయ్యగారి దృష్టిలో పడి, సినిమా రంగంలో కాలూని అమాంతం అగ్రశ్రేణి సినిమా నటీమణి అయిపోయింది. 'సతీసావిత్రి' నాటకాన్ని చూచి ఆమెను సినిమాల్లో కూడా సావిత్రిగానే నటింపచేశారు. నాటకంలో నటించిన రామతిలకంతో బాటు, గగ్గయ్య, పులిపాటి



ముగ్గురూ ఆ సినిమాలో అదే పాత్రల్లో నటించారు. అలా ఆయన శ్రీరంజని, కాంచనమాల, పుష్పవల్లి, కృష్ణవేణి, భానుమతి, అంజలీదేవి వంటి వారెందర్నో ఈ సినిమా రంగానికి సి. పుల్లయ్య పరిచయం చేశారు.

ఈస్టిండియా వారు తీసిన 'రామదాసు'లో ఆమె ఆనాటి సుప్రసిద్ధ నటుడు సి.యస్సార్. ఆంజనేయులుగారితో నటించిందామె. ఆ రెండు చిత్రాలూ 1933లో విడుదలయ్యాయి. తరువాత 'శ్రీకృష్ణలీలలు', చింతామణి, ద్రౌపదీ వస్త్రాపహరణం, సతీ తులసి, మోహినీ రుక్మాంగద సత్యభామ చిత్రాల్లో నటించారు. తక్కువ కాలంలో ఎక్కువ చిత్రాల్లో నటించిన నటీమణి. ప్రతీ చిత్రంలోనూ ఆమె పాడిన పద్యాలకూ, పాటలకు జనం ఈలలూ వేసేవారు, వన్స్ మోర్‌లు కోరేవారు. అది సినిమా అని జనం మరిచేవారు. రీలును త్రిప్పి వేయించుకొనేవారు. ఇంతటి ప్రతిభా పాటవాల్ని చూపిన యశోవిశాలిని 33 సం॥ములే జీవించింది. ఏ దిష్టి దోషమో ఏమో అర్ధాయుష్షుగా అర్ధశతాబ్ది వయస్సు కూడా బ్రతకకుండానే అనంతుడు ఆమె ప్రాణాలను తీసుకునిపోయాడు. ●

## జీ.వి. రావ్ పేజీ

# ఈ లోకాన్ని ఏ ఇద్దరూ ఒకే మాదిరిగా చూడరు.

- స్వామి వివేకానంద



(గోటేటి వేంకటేశ్వరరావు)

పైన చెప్పిన సూక్తిలో ఎంతో అర్థం, గూడార్థం రెండు కలిసి వున్నాయి. ఇది ఎలక్షన్ల సమయం. మన దేశంలో హిందువులపై రెండు అభిప్రాయాలు వున్నాయి. కాశ్మీర్ సమస్యకి కూడా భిన్న అభిప్రాయాలు వున్నాయి. ఇది మన దేశం పాలిట శాపం, పాపం. విపరీతమైన దైవదూషణ కూడా కారణమే.

Without spiritual stamina, no one can stand up to the threats and onslaughts of circumstances in life. - Swami Chinmayananda.

ముస్లిములను ఒక్క మాట అంటే దేశం అంతా అల్లర్లు జరుగుతాయి. కాని హిందువులను ఎన్ని రకాలుగానైనా ఎగతాళి, హేళన చేసి మాట్లాడవచ్చు. ఈ నాయకులకు ఎందుకు ముస్లిములంటే అంత జాలి, దయ. కేవలం వారి ఓటు కోసమే. వారు మన కన్న తక్కువ శాతం కదా. కాని వారు ప్రతి ఎలక్షన్‌లోనూ ఓటు వేస్తారు. మనం ఓటు వెయ్యడం దండగ అనుకుంటాం. అదే హిందువులందరూ ఏకమయ్యి ఓటేస్తే తప్పకుండా పరిస్థితులు మారతాయి.

ఎలక్షన్ నామినేషన్లు వేసేముందు దేవుళ్ళ దగ్గరికి వెళ్ళే నాయకులు గెలిచాక ఆ దేవుడు డబ్బుకే ఆశపడతారు. పాపభీతి అసలు వుండదు. తన తరువాత సంతానం ఎలా వుంటుందో వారికి అక్కరలేదు. ఇక ప్రజలంటారా తమ ఇల్లు, కుటుంబం వరకు బాగుంటే చాలనుకునే వారే ఎక్కువ. దేశం గురించి పట్టించుకునే వారు లేరు. ఇకనైనా మనం కళ్ళు తెరిచి నిజానిజాలు గ్రహించకపోతే మనకన్నా మూర్ఖులు లేరు? మనం కూర్చొని వున్న చెట్టుకొమ్మను మనమే నరుక్కుంటున్నాము.

❊ ❊ ❊

## మన దేశం హిందూదేశం కాదా? హిందూత్వం మతతత్వమా!

**1947** సం॥ము ఆగస్టు 14న హిందూ సిద్ధాంత దేశమైన భారతదేశం, బ్రిటిష్‌వారి బానిసత్వ సంకెళ్ల నుంచి బంధవిముక్తురాలై, మహ్మదాలీ జిన్నా మంకుపట్టుతో ముస్లిమ్ భాగస్వామ్య దేశంగా పాకిస్తాన్‌గా విడిపోయింది, శేషించిన దేశం హిందూ భాగంగా హిందువుల దేశమైన 'ఇండియా'గా విడివడింది. వాళ్లు సంపూర్ణ ఇస్లామిక్ రిపబ్లిక్ దేశంగా పాకీస్థాన్ నామకరణం చేసుకున్నారు. కానీ, మన పెద్దలు 'హిందుస్థాన్'గా గానీ, భారత్‌దేశంగాగానీ, ఉదారభావం కల హిందూ నాయకులైన 'గాంధీ, నెహ్రూ, పటేల్ ఆదిగాగల ప్రముఖ నాయకులకు బుద్ధి కలుగలేదు. 'ఆజాద్' వంటి సామ్యవాదులైన ముస్లిము నాయకులు 'ఇండియా'తో వుండిపోవు కోరికను



ప్రకటించడంతో, వారిని తమతోనే సమ గౌరవమిచ్చి ఉండమనడం, హిందూ ముస్లిమ్ భాయ్ భాయ్'గా వ్యవహరించడం జరిగింది. కొన్నాళ్లకు చాపక్రింద నీరులా చేరి హిందూ ముస్లిమ్ విద్వేషాలను పెరుగుతూండడం, సౌమ్యవాదులతో తిరిగి సమసిపోతూండడంతో హిందూ ముస్లిమ్ సామరస్యం, వారికీ 'ఓటు వేసే హక్కు, రాజ్యపాలనంలో పాలు పంచుకోవడం జరుగుతూ వస్తున్నది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వంటి పెద్ద పెద్ద జవాబుదారీ పదవుల్ని ముస్లిములు నిర్వహించడమూ జరుగుతూంది.

స్వాతంత్రం వచ్చిన ఈ 70 సంవత్సరాల్లో భారతదేశం నాగరికంగా, పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా ఎంతో అభివృద్ధి గాంచడంతో ప్రక్కనున్న పాకీస్థాన్ ప్రక్కలో బల్లెంగా కొంత కాశ్మీర్‌ను ఆక్రమించుకోవడం, శేషించిన కాశ్మీర్‌పై దిన దినమూ విరుచుకు పడడం, అక్కడున్న హిందువులను (పండిట్లను) హింసించడం, వెళ్లగొట్టడం, పాలకుల్లో వారే అధికం కావడంతో, సమస్యలూ అధికములైనాయ్. దేశంలోని ప్రధాన నగరాల్లోనూ, పార్లమెంటు పైననూ విరుచుకు పడడం, కరుచుకుని తినడం హెచ్చుకావడం, పేట్రేగి పోవడం ప్రమాదంగా పరిణమించింది.

దేశంలో 5 శాతం ఉండే ముస్లిములు 20 శాతం దాకా పెరిగి, దేశ సార్వభౌమాధిపత్యం పైననే పెత్తనం సాగించే విధంగా తయారయ్యారు. పాకిస్థాన్, బంగ్లాదేశాల్నుంచీ వందలూ, వేల కొద్దీ ముస్లిములు భారతదేశంలోకి చొరబడుతున్నారు, ఓటు హక్కులను సంపాదిస్తున్నారు. వారి ఓట్ల కోసం పదవీ దాహోర్తులైన మన రాజకీయ నాయకులు ముస్లిములకు రిజర్వేషన్లు పెంపుచేస్తామంటూ– ఒకరిపై మరొకరు పోటీ పడ్తున్నారు. ఇదిలా ఉండగా ఈ మధ్య క్రైస్తవ దేశాల్నుంచీ కోటానుకోట్ల ధనం భారతదేశంలోకి దిగుమతియవుతూ మతమార్పిడి వ్యవహారం చేస్తున్నారు, రోజూ కొందర్ని తమ క్రైస్తవ మతంలోకి చేర్పించనిదే వారికి నిదురపట్టదు. కాశ్మీర్‌లో దినదినమూ హిందువులు చనిపోతూండడం, దిక్కూదివాణం లేనివారిలా ఊళ్లుబట్టి పోతూండడం వార్తగా తీసుకోని వీరు, క్రైస్తవ చర్చిలు ధ్వంసమవుతున్నాయనీ 'నన్'లుపై అత్యా చారం జరుగుతూందని ప్రచారం చేస్తూ, విచారం పడ్తూన్న వీరు, ఎంతమంది హిందూ కన్యలూ, వితంతువులు అత్యాచారాలకు గురి అయ్యారో హత్యల పాలయ్యారో వీరు గ్రహించడంలేదు.

కొంతమంది బూర్జువా నాయకులు హిందూత్వమును మతతత్వమనీ, మౌఢ్యమనీ నిందిస్తున్నారే! ఆ హిందూ మతం మూలసిద్ధాంతమైన సనాతన ధర్మంలో– 'సర్వేజనా స్సుఖినోభవన్తు, సమస్త సన్మంగళాని భవన్తు' పొరుగువాణ్ణి ప్రేమించు, అతిథిదేవోభవా– అని బోధించు నందువల్లనే జాతిపిత గాంధీ 'వైష్ణవ జనతో తేనే. కహిహే' అంటూ సకల ధర్మశ్రేయోరాజ్యమైన రామరాజ్యంగా అందరూ సుఖంగా కలిసి ఉండాలనే సిద్ధాంతం ప్రచారం చేసిన కారణంగానే, ఇన్ని మతాలు ఈ భారతదేశంలో ఆవాసం ఏర్పరచుకోకలిగాయ్. అధికారంలోకి రాగలిగాయ్ అంటే– ఆ హిందూత్వ సిద్ధాంతంలోని ఔదార్యం, ఆదరణ, ఆశ్రయం కల్పించే సిద్ధాంతమే కారణం. లేకపోతే– ఇన్ని మతాలు ఈ భారతమాత పొత్తిళ్లలో ఉండకలిగేవా? ఒక మతానికి ప్రచారం, మరో మతంలో తీవ్రవాదం ఉండడం వల్లనే కదా దేశం అనర్థపాలవుతూంది. ఇస్లాము దేశాల్లో కానీ, మరో మత దేశాల్లో గానీ ఈ స్వాతంత్ర్యం – స్వేచ్ఛా ఉందా? మతతత్వమని నిందించే హిందూ నాయకులేంవి చెబుతారు. ●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225